విడి ప్రతి రూ.15/-

ఫిబ్రవరి 2011

# స్పందన

ఆధ్యాత్మిక మాసపత్రిక



**యెహోవా, నీవు దానిని ఆశీర్వదించావు.**
**అది ఎన్నటికినీ ఆశీర్వదించబడియుండును.**

1 దినవృ.17:27

**For you have blessed it, O Lord,**
**and It shall be blessed forever". 1 Chro.17:27**

## ప్రత్యేక సంచిక **స్పందన**లో...

# బ్రదర్ యేసన్న గారి సేవా జీవిత వివరాలతో...



మనకు దేవుడిచ్చిన వరం ప్రియులు బ్రదర్ యేసన్న గారు. నన్ను ఎంతగానో ప్రేమించే ఈ దైవజనునితో గడిపే సమయం ఎంతో ప్రశస్తమైనది. ఆ మధ్యన నేను, దైవజనులు ఆచార్య ఆరార్కే గారు గోరంట్లలోని హోసన్నా ప్రార్దనా మందిరమును దర్శించినపుడు వారు మా యెడల చూపిన ప్రేమ అంతా ఇంతా కాదు. ఆరార్కే గారి స్వస్థలం గోవిందపురం చర్చి నిర్మాణానికి మంచి కానుక అందించారు. దైవజనులతో తమకున్న ఆత్మీయ అనుభవాలన్నింటినీ గుర్తు చేసుకున్నారు. గోరంట్లలోని ప్రార్ధనా మందిరమంతా మాకు చూపించారు. "నిజం చెప్పొద్దూ కొన్ని వేలమంది కూచోటానికి వీలున్న మందిరంలో దేవుని మహిమను, దేవుని ఆత్మ అభిషేకాన్ని అణువణువునా నేను అనుభవించాను". యేసన్న గారు తనకంటే చిన్నవారిని కూడా దేవుని సేవకులను 'అన్నా' అంటూ ఆప్యాయంగా పలుకరిస్తారు. అన్నా, ఏడో తరగతి మూడు సార్లు తప్పినవాణ్ని. రక్తం కక్కుకుంటూ తిరుగుతుంటే 'యేసయ్య స్పర్శ' నన్ను అద్భుతంగా మార్చి వేసింది అంటూ దీనసేవకుడిచ్చే సాక్ష్యం దేవునికి మహిమకలిగించేది. బ్రదర్ యేసన్న గారి సందేశాలు, పాటలు విని ప్రభువుకు జీవితాలర్పించుకున్న వారు కోకొల్లలు.

"చచ్చిపోతాడు, లాభం లేదు ఇంటికి తీసుకెళ్లండి" అంటే హాస్పటల్ నుండి తీసుకెడుతూ ఒక్కసారి యేసన్నగారి చేత ప్రార్ధన చేయిద్దాం అని తీసుకెళ్లారట. అన్నగారు అలా వచ్చి అంత మంది మధ్యలో ఊరికే అలా తాకి, ప్రార్థించి వెళ్లారట. అంతే పోతున్న ప్రాణం తిరిగి వచ్చింది. ఈ రోజున విజయవాడ, భవానిపురంలో సక్సెస్‌ఫుల్ ఆర్‌యంపి డాక్టరుగా దేవుని నామాన్ని మహిమపరిచే డా॥ విజయకుమార్ గారు నాకు మంచి మిత్రులు, స్నేహితులు.

"సాధారణమైన ఒక దైవదాసుని ద్వారా దేవుడు అసాధారణ కార్యాలు జరిగించగలడు" అనటానికి బ్రదర్ యేసన్న గారిలాంటి దైవజనులే గొప్ప రుజువు. నాతోపాటు ప్రియ సోదరులు రెవ. పి.బి రవి ప్రసాద్ గారు





డా॥ దేవ గారి మరో అద్భుత రచన

భయపడకు! దిగులు పడకు! జడియకు!

మీ ఆత్మలకు ఉత్తేజం కలిగించి,
అలసిన మీ జీవితాలకు సేదతీర్చే ఆదరణ సందేశాలు.
జీవితంలో మరింత ఆత్మ విశ్వాసంతో
మిమ్మును ముందుకు నడిపించే దివ్య వర్తమానాలు.

విరాళము: రూ. 50/- (రిజిష్టర్ పోస్టేజి అదనం)

1976 - 2011 35 సంవత్సరాలుగా దేవుని అపార కృపలో

# స్పందన

ఆధ్యాత్మిక మాసపత్రిక

*The largest circulated Telugu Christian monthly since 35 years*

ఫిబ్రవరి 2011 సంపుటి 35 సంచిక 2

వ్యవస్థాపక, ప్రధాన సంపాదకులు:

**ఆచార్య ఆరార్కే మూర్తి**

ప్రచురణకర్త, సంపాదకులు:

**డా॥ దేవసహాయం దండల**

గౌరవ సలహాదారులు:

**ప్రొఫెసర్ కృపాచారి గుజ్జర్లమూడి**

సహకారం:

**పాస్టర్ పి. సురేశ్ బాబు**

సంపాదక వర్గం:

**బ్రదర్ కె. పరమానందం, బ్రదర్ ఎన్. దేవానంద్, బ్రదర్ ఆర్. ఎలూజై, రెవ. కె. జాన్ మోజెస్, శ్రీమతి ఎన్. లిల్లీ భాస్కర్**

సహాయ సంపాదకులు:

**బ్రదర్ డి. ఎఫ్రాయిం, బ్రదర్ డేవిడ్**

మా అడ్రస్

**స్పందన ఆధ్యాత్మిక మాసపత్రిక**

51-4-12, ఇ.ఎస్.ఐ హాస్పటల్ రోడ్, గుణదల,
విజయవాడ - 520 004,
ఫోన్ : 0866- 2456547, 9490 11 3300
*E-mail: spandana1976@gmail.com*

## ఈ సంచికలో..

| | |
|---|---|
| యేసే దేవుడు | 6 |
| విశ్వాసి జీవితం | 8 |
| ప్రభువుకే వదిలేద్దాం! | 10 |
| మనో దృష్టి | 12 |
| మహాజ్ఞాని కింగ్ సాల్మన్ | 14 |
| ఆధ్యాత్మిక జ్ఞానము | 16 |
| కుటుంబ బాధ్యతలు | 18 |
| పాత రోత జీవితము | 20 |
| సత్యమునకు స్తంభము | 22 |
| సొలొమోను షేబ | 25 |

### చందా వివరాలు

| | స్వదేశంలో | విదేశంలో |
|---|---|---|
| 1 సంవత్సరం | ₹ 150 | $ 20 |
| జీవిత సభ్యత్వం | ₹ 2000 | $ 200 |
| పోషక సభ్యత్వం | ₹ 150 (ప్రతినెల) | $ 20 |

**ప్రత్యేక మనవి**

అందరికీ అందుబాటులో ఉండాలని సం. చందా రు.150 గానే ఉంచాము. వాస్తవానికి సుమారుగా రు.200/- కంటే ఎక్కువ ఖర్చవుతుంది. పరిచర్య అభివృద్ధి కోసం ప్రార్థించి, ప్రభువు మిమ్మును ప్రేరేపిస్తే మీ సేవా కానుకలు పంపాలని మనవి. కానుకలు పంపుచున్న చందాదారులకు మా హృదయపూర్వక కృతజ్ఞతలు, స్పందన పరిచర్య నిమిత్తం మీరు పంపే కానుకలు, చెక్కులు, డ్రాఫ్టులు, ఎం.ఓ.లు, స్పందన **(SPANDANA)** పేరు మీద మా అడ్రస్‌కు పంపాలి. మీ కానుక అందిన వెంటనే స్పందన ఆఫీసు నుండి ఉత్తరం రాస్తాము.

అకౌంట్ పేరు "స్పందన" (SPANDANA)

ఆంధ్రాబ్యాంక్, గుణదల (బ్రాంచ్), విజయవాడ
ఆన్‌లైన్ అకౌంట్ నం. 015810100016691

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా,రామవరప్పాడు (బ్రాంచి), విజయవాడ
ఆన్‌లైన్ అకౌంట్ నం. 31541230212

### స్పందన ఆఫీసుకు రావాలంటే...

విజయవాడలో, గుణదల సెంటర్ నుండి ఇ.యస్.ఐ హాస్పటల్ రోడ్‌లో ఉన్న పాత పంచాయితి ఆఫీసు సెంటర్‌కు రావాలి. ఇయస్ఐ హాస్పటల్ రోడ్డులో ఉన్న దేవాలయం, ప్రక్కనే ప్రగతి నివాస్ అపార్ట్‌మెంట్స్ ఉంటుంది. మొదటి అంతస్థులో రెండో అపార్ట్‌మెంట్

ఆఫీసు సమయం ఉ॥ 10 నుండి సా॥ 5 గం.

Printed, Published and owned by **DEVASAHAYAM DANDALA** Printed at **Spandana Offset Printers**, Suryaraopet, VJA-2. Ph:2430148, For Spandana Graphics & Published from # 30-3-13, Durga Agraharam, Vijayawada - 2.

# స్పందన ప్రతిస్పందన

### ఆధ్యాత్మిక అభివృద్ధి

ప్రభువునందు సంపాదకులకు ప్రభువు పేరిట వందనములు. పత్రిక ప్రతినెల క్రమముగా అందుచున్నది. అందులో అన్ని అంశములు మా ఆధ్యాత్మిక అభివృద్ధికి ఎంతో ఉపయోగపడుచున్నవి. గ.ను.క, మెదడుకు మేత ప్రతినెల నింపి పంపుచున్నాము. ప్రతినెలా పత్రిక కొరకు ఆశతో ఎదురు చూస్తుంటాము.

**కె. శైలీల్య,** కంచికచర్ల

### యేసయ్య ప్రేమ ప్రత్యక్షంగా

ప్రభువునందు ప్రియులు డా॥దేవసహాయం గారికి వందనములు. మీరు అందిస్తున్న "స్పందన" టీ.వీ కార్యక్రమము క్రమముగా చూస్తున్నాము. ఎంతో ఆధ్యాత్మికంగా బలపడుతున్నాము. యేసయ్య ప్రేమ మీ మాటల్లో ప్రత్యక్షంగా చూస్తున్నాము.

**యమ్. ఆల్‌ఫ్రెడ్,** కాజీపేట

### 20సం॥రాలుగా..

స్పందన సంపాదకులకు నూతన సంవత్సర శుభాకాంక్షలతో వందనములు తెలియుజేస్తున్నాను. మీరు పంపిచే స్పందన మాసపత్రిక మాకు ఎంతో ఆశీర్వాదకరముగా ఉంటుంది. సుమారుగా 20సం॥ల నుండి పత్రికను చదువుతున్నాము. అదే విధముగా రేడియోలో ఆరార్కే మూర్తిగారి ప్రసంగం మేము తప్పకుండా వింటుంటాము.

**పి. మరియమ్మ,** అల్లవరం

### అభివృద్ధి

దైవజనులు దేవసహాయం అయ్యగార్కి మా హృదయపూర్వక వందనములు. అయ్యా 'స్పందన' టీ.వీ.కార్యక్రమం మేము వీక్షిస్తున్నాము. తద్వారా ఆశీర్వాదములు పొందుకోవడానికి ఎంతగానో ఈ కార్యక్రమాలు సహాయపడుతున్నాయి.

**బి. ధర్మరావు,** కోరుకొండ

### ఆశ్చర్యము, ఆనందము

ప్రభువునందు ప్రియులు స్పందన ఎడిటర్ గార్కి స్పందన బృందానికి వందనములు. దైవజనులైన మీరు ఎల్లవేళల ఆయురారోగ్యములు కలిగి యుండవలెనని నా యొక్క అనుదిన ప్రార్ధనలో ప్రభువునందు ప్రార్థించుచున్నాను. గ.ను.క, మెదడుకు మేత, మీ యొక్క అద్భుతమైన కూర్పు చాలా ఆశ్చర్యమును, ఆనందమును కలిగించుచున్నవి. స్పందన సంచికలోని ప్రతి అంశము చాలా విలువలను, ఆధ్యాత్మికాభివృద్ధిని కలిగించుచున్నవి.

**జె. సరోజిని,** రాజమండ్రి

### ప్రయోజనకరంగా..

ప్రభువునందు ప్రియులైన సంపాదకులకు మా వందనములు. మీరు పంపిచుచున్న స్పందన పత్రిక ప్రతినెలా అందుచున్నది. పత్రికలోని విషయాలు మా ఆధ్యాత్మిక జీవితాలకు ప్రయోజనకరంగా ఉన్నాయి.

**సి. హెచ్. దావీదు,** భట్టిప్రోలు

### యేసయ్యలో ఎదుగుదల

దైవజనులైన డా॥దేవగార్కి వందనాలు. అయ్యా మీరు చెప్పే ప్రసంగాలు మాకు ఎంతో ఆధ్యాత్మికంగా బలపడడానికి, యేసయ్యలో ఇంకా ఎదగడానికి ఉపయోగపడుతున్నాయి. "చిన్నారి స్పందన" కార్యక్రమము చూసి మేము ఎంతో ఆనందించాము. మా పిల్లలకు చాలా ఉపయోగపడుతుంది. చాలా బాగుందని పిల్లలు మీరు అడిగే ప్రశ్నలకు సమాధానాలు వ్రాస్తూ ఉత్తరం వ్రాస్తున్నారు. ధన్యవాదములు.

**యమ్. సౌజన్య,** ఇందుపల్లి

**మాతో కలిసి ప్రభువును స్తుతించండి!**
**ప్రభువు చిత్త ప్రకారం..... వచ్చే నెల సంచిక 50 వేల కాపీలు ప్రింట్ చేస్తున్నాము!!**

## ప్రధాన సంపాదకుని సిరా..

వస్తువాహనాలకు అంకితమై పోయిన జీవితం మృతతుల్యం. అది ఆధ్యాత్మికంగా మోడుబారిన బతుకు. దేవుణ్ని పోలిన బతుకులు ఏపుగా పెరిగే వృక్షం లాంటివి. యేసురూపానికి మారుతూ ఉన్నవారే నీతిమంతులు. విశ్వాసులకు ఆశ్రయం క్రీస్తే. విశ్వాసి జీవితం నీటి కాలువల యోరన నాటబడిన చెట్టులాంటిది. వేరు లోతుగా క్రిందికి చొచ్చుక పోతుంది. వేసవికాలమైనా, నీటి ఎద్దడి ఎంత ఉన్నా ఈ చెట్టు ఫలిస్తూనే ఉంటుంది. విశ్వాసి జీవిత పరమార్థం ఫలించటమే!

ఇహ పరములలో ప్రతిదీ, సర్వమూ క్రీస్తునందే సృజించబడింది. అంతా క్రీస్తు ద్వారా క్రీస్తును బట్టే నిర్మించబడింది. క్రీస్తే లేకపోతే మన జీవితాలకు అర్థమేమిటో గమ్యమేదో తెలియదు. విశ్వాసులం మనం పరలోకంలో సర్వసమాజంగా కూడుతాము. దేవునికి కృతాజ్ఞతాస్తుతులు సమర్పిస్తాము."ప్రభూ, నీవే అర్హుడవు". మా దేవా, మహిమ, ఘనత ప్రభావములు నీవే! నీవే సమస్తమూ సృజించావు. నీ చిత్త ప్రకారమే నీ సంకల్పానుగుణంగా సృష్టి ఉనికిలోకి వచ్చింది. "ఇది స్తుతి పాట". నిత్య ప్రణాళికను బట్టి ఆయనకు స్తుతి. ఆయన చిత్తానికి అనుగుణంగా మనం జీవించాలి. మన జీవిత పరమోద్దేశ్యం పరమార్థం తెలుసుకొని జీవించాలి. అ.కార్య 13.22 అంటోంది. దావీదు దేవుని ఇష్టానుసారమైన మనుష్యుడు. అతడు దేవుని ఉద్దేశ్యములన్నీ నెరవేర్చాడు. దేవుడు నిన్ను నన్ను చేసినది తన కోసమే తన మహిమ కోసమే! ఈ సంగతి తెలుసుకునేవరకు మన జీవితానికి అసలు అర్థమేమిటో మనకు బోధపడదు. నీవెవరు? నీవెందుకు నిర్మించబడ్డావు? ఇవన్నీ నీకు తెలియదు. దేవుడికి ఎప్పుడో తెలుసు. నీవు పుట్టక మునుపే ఆయన నీ బతుకంతా ముందుగా నిర్ణయించాడు. క్రీస్తును కలుసుకో.

క్రీస్తునందు భవదీయుడు - ఆరార్కె

### ప్రత్యేక గమనిక

స్పందన చందాలు, జీవిత సభ్యత్వాలు, స్పందన సేవలో జరుగుతున్న కార్యక్రమాలకు పంపే కానుకలు - ప్రధాన సంపాదకులు, సంపాదకుల పేరుల మీద చెక్‌లు, డ్రాఫ్టులు పాఠకులు పంపుతూ ఉన్నారు. సంస్థ ఆడిటింగ్ తదితర విషయాల సౌకర్యం కోసం ఇకనుండి స్పందన ద్వారా జరుతున్న సేవ కోసం పంపే కానుకలు, అలాగే స్పందన సంవత్సర చందాలు, జీవిత, పోషక సభ్యత్వాలు **"స్పందన" (SPANDANA)** పేరు మీదనే పంపాలని మనవి. ఇకనుండి ఎడిటర్ పేరు మీద గాని, చీఫ్ ఎడిటర్ గారి పేరు మీద గాని వ్యక్తిగత పేరుల మీద కానుకలు గాని చందాలు గాని పంపక స్పందన ద్వారా జరిగే సేవకు సంబంధించిన కానుకలు కేవలం "స్పందన" పేరు పంపాలని ప్రత్యేక ప్రకటన. దయచేసి గమనించాలని మనవి. -సంపాదకులు

# మనలో మాట....

క్రీస్తునందు మా ప్రియపాఠకులకు,

ఫిబ్రవరి మాసం శుభాకాంక్షలు యోహాను రాసిన మూడవ పత్రిక 2 వచనంతో తెలియజేస్తున్నాను. **'ప్రియుడా, నీ ఆత్మ వర్ధిల్లిన ప్రకారము నీవు అన్ని విషయాల్లో వర్ధిల్లుతూ సౌఖ్యంగా ఉండవలెనని నీ కోసం ప్రార్థిస్తున్నాను'.**

నిత్య జీవితంలో మనం చేసే కొన్ని పొరపాట్లు మనకు తెలియకుండానే మనకు చాలా నష్టం కలిగిస్తాయి. దేవుడికివ్వాల్సిన ఘనతను చాలాసార్లు మనం మనకు తెలియకుండానే మనుష్యులకు ఇస్తుంటాము. తద్వారా చాలా నష్టపోతాము. దేవుడు చేసే అద్భుత ఆశ్చర్యకార్యాలు **దేవుడు చేశాడు** అని చెప్పేదానికి బదులు దైవజనులకు, సంస్థలకు ఆ ఘనతను ఆపాదిస్తుంటారు. గత కాలంలో ఓ క్రిస్టియన్ ఛానల్ ఇంటర్వ్యూలో ఐఎయస్ సీటు పొందిన ఓ యువకుడు ఈ క్రెడిట్ అంతా తను కానుక పంపితే తన కోసం ప్రార్థన చేసిన ఓ సంస్థది అని చెబుతున్నాడు. గమనించాలి, మన కోసం ప్రార్థించిన సంస్థదికాదు ఆ ఘనత, **మన ప్రభువుది.** బాగా గుర్తుంచుకుందాం! నీ దేవుడి స్థానంలో నీవు ఏది ఉంచినా అది నీవు ప్రేమించే సంస్థే గాని, సంఘమే గాని, దైవసేవకుడే గాని, తలాంతులు గలిగిన ఏవ్యక్తే గాని, **నీ జీవితంలో అది విగ్రహం అవుతుంది.** కారణం దేవునికంటే ఎక్కువ స్థానం దానికిస్తున్నావు గనుక. ***విషయం చిన్నదే అయినా బాగా గుర్తుంచుకోవాల్సిన అంశం!***

ఆ మధ్యన ఓ దైవసేవకుడు మాట్లాడుతూ ***మాకు కూతురు పుట్టిన తరువాత బాగా కలసి వచ్చింది*** అన్నాడు. ప్రక్కనే ఉన్న కొడుకు, నాన్నా నేను పుట్టినపుడు కలిసి రాలేదా? అంటూ ముఖం చిన్నబుచ్చు కున్నాడు. లోకంలోని అన్యులు అలాంటి మాట వాడారంటే ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదు గాని, దేవుని పిల్లలు కూడా అలాంటి మాటలు అంటూన్నారంటే లోకపు ప్రభావం వారి మీద ఉన్నది.

ఇక్కడ మనం గమనించాల్సింది, మనకు కలిసి వస్తుందంటే మనం దీవించబడుతున్నామంటే ఎవరి వలన? మన దేవుని వలన. అలాంటప్పుడు మనం ఎవరికి మహిమను తేవాలి? మన దేవునికే కదా! దేవునికివ్వాల్సిన మహిమ దేవునికివ్వాలి.

'గొడ్డొచ్చిన వేళ, బిడ్డొచ్చిన వేళ' అంటూ లోకపు మాటలు చెబుతారు. దైవజనులు ఆరార్కే గారు రాసిన పాట ఒకటి **'లోకాశలు నాకు లేవు, లోకపు మాటలు రానే రావు'.** మన మాటల్లో సహితం ప్రభువును మహిమపరచాలి. జీవమును, మరణమును నాలుక వశము. అవునండీ, అనేక సార్లు మా ప్రియ పాఠకులకు నేను ప్రేమతో మనవి చేస్తుంటాను. మీ నోటి మాటలు చాలా విలువైనవి.

నాకు తెలిసిన సోదరి విధవరాలుండేది. ముగ్గురు ఆడపిల్లలు. ఆఫీసులో అటెండరుగా చిన్న ఉద్యోగం. అయితే ఏనాడే గాని భయపడేది కాదు. భర్తను గురించిన దిగులు గుండెల్లోనే దిగమింగుకుని విశ్వాసంతో పిల్లలను పెంచింది, జీవితాన్ని కొనసాగించింది. దేవుని సేవకు **ధారాళంగా ఇచ్చేది.** అమ్మా.... కొంచెం జాగ్రత్తగా... అంటే... నా ప్రభువు నాకున్నాడు బ్రదర్, మా కేమి తక్కువ కాదు, అంటూ ఎప్పుడు చూచినా విశ్వాసపు మాటలే మాట్లాడేది. అద్భుతమైన విధానంలో ముగ్గురు పిల్లలూ చక్కగా చదువుకున్నారు, పెళ్లిలయినవి ముగ్గురూ మూడు దేశాల్లో ఉన్నారు. కారణం విశ్వాస సహితమైన ఆమె నోటి మాటలు!!

ఈ మధ్య ఓ విషాదకరమైన విషయాన్ని విన్నాను. 'అమ్మో, ట్రయిన్ ప్రయాణమంటే నాకు చాలా భయం, అనే వ్యక్తి చాలా సంవత్సరాల తరువాత ట్రయిన్ ప్రయాణపు ఎక్సిడెంట్‌లో చనిపోయాడు' బంధువు లందరూ ఆయన అన్నట్టే జరిగిందే అని ఆశ్చర్య పోయారు! వెంటనే బైబిలు మాటలు నాకు గుర్తొచ్చాయి.

**జీవమును, మరణమును నాలుక వశము.**

సరే! దేవునికివ్వాల్సిన ఘనతను, మహిమను మరి దేనికిచ్చానా దేవుడు సహించడు. 'నా మహిమను నేను ఇతరులకు ఇవ్వను అంటాడు' దేవుడు. దేవునికి కోపం తెప్పించే విషయాల్లో ఇది చాలా ప్రాముఖ్యమైనది. కనుక ప్రియపాఠకులారా దేవుని బిడ్డలు ఇలాంటి విషయాల్లో జాగ్రత్త వహించాలి. మన బిడ్డలను, పెద్దవారిని మనం ప్రేమించాలి, గౌరవించాలి గాని దేవుని మహిమను దేవునికే ఆపాదించాలి. అందుకే ప్రభువన్నారు – కైసరువి కైసరుకు దేవునివి దేవునికే ఇవ్వాలి.

దైవజనులు ఆచార్య ఆరార్కే గారి ఆరోగ్యంకోసం ప్రార్థించాలని మనవి. దేవుడు దైవజనులకు పక్షిరాజు యౌవన బలాన్ని ప్రసాదించి, పడకనుండి లేపి అద్భుతమైన సేవ జరిగించాలని ప్రార్థిస్తున్నాము. యేసు క్రీస్తు ప్రభువువారి శక్తిగల నామంలో విశ్వాసంతో, బలహీనతను పారద్రోలుతున్నాము.

దేవుని పిల్లలందరూ 'ఆమేన్' అంటున్నారు. దైవాశీస్సులు.

ఆత్మలసేవలో క్రీస్తునందు మీ సోదరుడు

**దేవ**

## మీ ఎడిటర్ ఆరోగ్యం కోసం ప్రార్థించాలని మనవి

*గత మాసం 'మనలో మాట'లో సైతాను కొంత మానసికంగా కృంగదీయాలని ప్రయత్నిస్తున్నాడు, అని రాసిన మాటను మా ప్రియపాఠకులు ప్రస్తావించి నా కోసం ప్రార్థిస్తున్నట్టు రాశారు. మీ అందరికీ నా ప్రత్యేక వందనాలు. శరీర బలహీనతల్లో ప్రభువే తన బలాధిక్యాన్ని వెల్లడిచేస్తున్నాడు. దేవుని మహిమకోసం అనేక కార్యక్రమాలు చేయటానికి ప్రభువు కృపచూపుతున్నారు. చిన్న వయసులోనే వచ్చిన డయబెటీస్ వలన అప్పుడప్పుడూ కొంత శరీర బలహీనత ఏర్పడుతోంది. ప్రభువు స్వస్థతా స్పర్శను నేను అనుభవిస్తున్నాను. సంపూర్ణ స్వస్థత కోసం విశ్వాసంతో దేవునికి స్తోత్రాలు సమర్పిద్దాము.*

*పెద్దలు చెప్పేమాటొకటి ఉంది కదా! సమయం ఉన్నపుడే నాలుగు రాళ్లు వెనుకేసుకో! అంటే ఆ మాటకు కొంత డబ్బు దాచుకో అని అర్థమనుకోండి. అలాంటి వెనుకేసుకొన్న డబ్బులు నాకు లేవుగాని ఆ మధ్యన వీపులో నొప్పొస్తుంటే డాక్టర్ గారు పరీక్ష చేసి కిడ్నీల్లో, గాల్‌బ్లాడర్‌లో రాళ్లున్నాయని చెప్పారు. పెద్దలమాట ప్రకారం నాలుగు రాళ్లు వెనుకేసుకున్నాం అన్నమాట! (నవ్వుకుంటున్నారా!) దేవునికి స్తోత్రాలు, మన దేవుడు అద్భుతాలు చేసే దేవుడు.*

*అయితే ఇప్పటి ప్రత్యేక ప్రార్థనా మనవేమంటే రెండు కిడ్నీలలో, గాల్ బ్లాడర్‌లో రాళ్లు ఏర్పడ్డాయని, ప్రయాణాలలో ఉన్నప్పుడు వాటి నొప్పి వస్తే భరించలేనని, రాళ్లను తొలగించాలని డాక్టర్లు చెప్పారు. ప్రభువు చిత్తమయితే ఫిబ్రవరి మూడో వారంలో ఒంగోలులో విశ్వాసియైన తమ్ముడు, ప్రముఖ యూరాలజీ స్పెషలిస్టు డా॥ నోయల్ జాన్ గారు దీనికి సంబంధించిన సర్జరీ చేయనున్నారు. హాస్పటల్ నుండి రెండు మూడు రోజుల్లో ఇంటికి వచ్చినా కొన్ని ఎక్కువ రోజులు విశ్రాంతి తీసుకోవాలని డాక్టర్ల సలహా. నా కోసం మీ ప్రత్యేక ప్రార్థనలు కోరుతున్నాను.*

– మీ సహోదరుడు **దేవసహాయం దండల**



- ఆచార్య ఆరార్కె

# యేసే దేవుడు

క్రైస్తవుడు అనే మాటకు అర్థం క్రీస్తునందు అభిషక్తుడు. ఒక వ్యక్తి క్రీస్తులోకి వచ్చినప్పుడు క్రీస్తునందు ఉండిపోతాడు. క్రీస్తుతో ఉక్కిరి బిక్కిరి అవుతాడు. అందుకే 1 యోహాను 2:27 అంటుంది. ***"క్రీస్తువలన ఆయనయందు మీరు పొందిన అభిషేకం నిలుస్తుంది."*** గనుక ఎవరు లేక ఏ మతం లేక ఏ ధర్మశాస్త్రము మీకు భోదించనక్కరలేదు. దేవుడు క్రీస్తునందు మీరు పొందిన అభిషేకం సత్యమే కాని అసత్యం కాదు. క్రైస్తవుడు అనే మాటను ప్రజలు తెలికగా తీసుకుంటున్నారు.

యేసుప్రభువుకు విశ్వాసులంటే ఎంతో ఇష్టం. ఎంతో శ్రద్ధ. అందరు విశ్వాసులు అవ్వాలని ఆయన సంకల్పం. యేసును దేవుడు మనకిచ్చాడు. ఆయనను ఎంతో విశ్వసంతో కృతజ్ఞతతో స్వీకరించడంలో మన బాధ్యత ఎంత గురుతనమైనదో తెలిసిపోతుంది. సాంఘిక నైతిక విధానాలన్నీ విశ్వాసులకు క్రొత్త స్వభావంతో పాటు వచ్చేస్తాయి. ఇవన్నీ విశ్వాసిలో సహజాతంగా ఉండిపోతాయి. పరశుద్ధం, నిర్మలం, శుక్ష్మం అయిన యేసు యోగం అంటే ఆయన కాడిని మోయడమే. యేసు కాడిని యేసుతో కలిసి విశ్వాసి మోస్తాడు.

## యేసు తత్వం

యేసు తత్వం నీవు తెలిసికొంటే చాలదు. అది అనుభవించే వారికి అర్థమవుతుంది. యేసతత్వం వేదాంతం కాదు, సిద్దాంతము కాదు. అది యేసుతో సంయుక్తమై జీవించడం. యేసు ప్రభువు తనను తానే పరిచయం చేసుకుంటూ ప్రకటన 1:18లో అన్నాడు. ***"నేను మొదటివాడను కడపటివాడను జీవించేవాడను. మృతుడనయ్యాను గానీ యుగయుగాలు సజీవుడనై ఉన్నాను. మరణం యొక్క, పాతళలోకం యొక్క తాళపు చెవులు నా స్వాధీనంలో ఉన్నాయి."*** ప్రియ సోదరీ, సోదరులారా! ఈ మాటలు మీరెలా గ్రహిస్తున్నారు. హెబ్రీ 13:8 ***"యేసుక్రీస్తు నిన్న నేడు ఒక్కటే రీతిగా ఉన్నాడు."*** ఉంటాడు. ఈ వచనం లోని ఆశీర్వవచనాన్ని పోగొట్టుకోకండి. నిన్న ఒకే రోజు దాని వెనక ఉన్నదంతా నీకు అనవసరం. నేడు అంటే ఈ రోజు. ఈ రెండు రోజులు నీ దృష్టిలో ఉంటే చాలు. రేపు తరువాత కాలం నీకనవసరం. అది యుగయుగముల



భవిష్యత్తు. యోహాను సువార్త 9వ అధ్యాయంలో గ్రుడ్డివాడి సాక్ష్యం మీకు జ్ఞాపకం ఉందా! నిన్న నేను గుడ్డోణ్ని ఇవ్వాళ నేను చూస్తున్నాను. మిగతా సంగతులు మీరు అడగనూవద్దు. నేను చెప్పనూవద్దు. అంటే ఇదే రక్షణ దినం, ఇదే అనుకూల సమయం. యేసు అంటే ఎవరనుకున్నారు? కలిగి ఉన్నది ఏది ఆయన లేకుండ కలుగలేదు. యేసును నమ్ముకొని చూడు ఆయన అంటున్నాడు. నేను నిన్ను నాలో దాచిపెట్టుకుంటాను. నిన్ను ఏ మాత్రమును విడువను నిన్ను ఎన్నడను ఎడబాయను. యేసుకు మనము ఎల్లప్పుడు కృతజ్ఞులం. ఆయన దేవుడు - కానీ మనుష్యుల పోలికగా పుట్టి దాసుని స్వరూపాన్ని ధరించుకొని తనను తానే రిక్తునిగా చేసుకున్నాడు. యేసు మానవుడు ఆయనను ఆరాధిస్తే వ్యక్తి పూజ అనుకుంటున్నారా? కాదు. ఆయన దేవుడు ఆయనను ఆరాధిస్తాము.

## యేసు అందరికి ప్రభువు

కొందరి హృదయాలు రాతి కంటే కఠినమైనవి. మరికొందరి హృదయాలు వెన్నకంటే మెత్తనవి. యేసు ప్రభువు అందరికి ప్రభువు, దేవుడు. ఈ సత్యాన్ని కఠిన హృదయులు ఒప్పుకొనరు. మెత్తని హృదయాలు యేసును చూడగానే ఆయన తమ కొరకై చేసిన సిలువ బలియాగాన్ని గుర్తించినప్పుడు కరిగిపోతాయి, విరిగినలిగిపోతాయి. ఫరో హృదయం రాను, రాను కఠినమైపోయింది. అలాగే అతడు నాశనం అయ్యాడు. యేసే మార్గము అన్నప్పుడు కొందరు ఒప్పుకొనరు దూషిస్తారు.

## యేసు రక్షకుడు

నైతికంగా మానసికంగా తనకు లోబడనివారిని యేసు బలవంతాన రక్షించడు. వద్దు బాబోయ్ అంటూవుంటే నిన్ను పెడరెక్కలు విరిచి కట్టి బలవంతాన పరలోకంలో పడేయ్యడు. లూకా 17:6 లోని ఆవగింజను చూడండి. ఆవగింజంత విశ్వాసము కలవారైతే అనగా యేసును నీలో కలిగి ఉంటే మీరు యేసు మాట వింటే నీ మాట అందరూ వింటారు. మిమ్ములను నమ్ముతారు. ఏమిలేదు, విశ్వాసివైన నీవు, నీవు విశ్వసించిన యేసూ ఇద్దరు కలిసి లోకాన్ని జయిస్తారు. ఏ మాత్రము సందేహంలేదు. యేసుక్రీస్తు రక్షకుడు, ప్రభువు అన్నప్పుడు ఇది అందరు నమ్మదగిన మాట పూర్తి అంగీకారానికి యోగ్యమైన మాట యేసును నమ్మడంలో అది మనకు జీవన మరణ సమస్యకు పరిష్కారమౌతుంది.

## యేసు విజయం

ఈ రోజులు మంచివి కాదు. అబద్ధక్రీస్తులు, దొంగ ప్రవక్తలు, ఈ రోజుల్లో ఎక్కువ అవుతున్నారు. వీరు నకిలీ క్రీస్తులు వెలుగు దూత వేషం వేసుకొని వస్తున్నారు. ప్రజలను మోసగించడానికి వారికి ఎన్నో శక్తులు ఉన్నాయి. గనుక విశ్వాసులు జాగ్రత్తగా ఉండాలి. మనం సైతాను బంధకాలలో ఉన్నవారిని విడిపించాలి. సైతాను గజదొంగ దేవుని బిడ్డలకు చెందిన విలువైన వాటిని దొంగిలించాడు. వీడి వద్దనుండి యేసు సాయంతో మనది మనం లాక్కోవాలి. సైతాను చేసే మరో పని ఒకటి ఉంది. లోకంలో మనుష్యులందరి మనో నేత్రాలకు గుడ్డితనం కలుగచేస్తాడు. సైతాను చేసిన గ్రుడ్డివారిని బాగుచేయడానికి వారి కండ్లు తెరవడానికి మనం పగలున్నంత వరకు పనిచేస్తూ ఉండాలి. సైతాను ఎవరనుకున్నారు. వాడు ఈ యుగానికి దేవత, దేవుడు. దేవుని బిడ్డలు యేసుక్రీస్తుతో ఆయన సౌశీల్యంతో నింపబడినవారు. యేసు ఒక్కడు చాలు ఆయన నీతో నాతో ఉంటే మనదే విజయం.

## ముగింపులో ఒక రహస్యం

యేసుమాటలు, యేసు ప్రేమ మనలను నింపివేసి ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. అందుకే దావీదు (కీర్తనలు 42:7) అన్నాడు. ***"దేవా! నీ తరంగాలు, అలలు అన్ని నా మీదగా పొర్లిపారాయి."*** విశ్వాసినైన నేను సొంతంగా నా అంతట నేను ఏమి చేయలేను. ఆయన నాలో ఉండి చెప్పినదే చేస్తాను. నేను ఆయన శిష్యుణ్ని అంటే ఆయన జత పనివాణ్ని అప్రంటిసును. యేసు ప్రభువును నమ్ముకోవడం అంటే ఏమిటి? ఆయనను నీలోకి రానివ్వాలి. నీవు నీ అంతరంగ జీవితమంతటిని ఆయనకు అప్పగించాలి. ఆయన నీలోకి ఎలా వస్తాడంటావా? మొదట నీ పాపాలను క్షమిస్తాడు. నీతో నీలో ఒక క్రొత్త ఆరంభం చేస్తాడు. అది అసలు రహస్యం. దైవాశీస్సులు. ఆమేన్!



- డా॥దేవసహాయం దండల

# విశ్వాస జీవితం

*(మొదటి పాఠం)*

మనలో మాటలో శుభాకాంక్షలతో తెలియజేసిన వాగ్దానమును మరోసారి మననం చేసుకుందాం. ***"ప్రియుడా, నీ ఆత్మలో నీవు వర్ధిల్లుచున్న ప్రకారము అన్ని విషయములలో వర్ధిల్లుచూ, సౌఖ్యముగా ఉండవలెనని నీ కోసం ప్రార్ధించు చున్నాను".***

గత కొన్ని వారాలుగా యోహాను రాసిన మూడవ పత్రికలోని ధ్యానాలు మన T.V. కార్యక్రమంలో ప్రసారం చేశాము. అద్భుతమైన ప్రతి స్పందన వచ్చింది. మీరీ కార్యక్రమాలను వీక్షించి ఉంటారని నమ్ముతున్నాను. లేనట్టయితే ఈ రోజే రాయండి, మీకు వెంటనే ఆ సిడిలు పంపిస్తాము. అయితే సిడి కొనుగోలుకు, కాపి చేయటానికి, మీకు పోస్టులో పంపటానికి అయ్యే ఖర్చుల కోసం మీకు తోచినంత కానుక, ఎంతయినా ఫరవాలేదు, మీ ప్రేమ కానుక పంపి సిడిలు తెప్పించుకోవచ్చును. త్వరలో వీటిని చిన్న పుస్తకరూపంలో కూడా ప్రచురిస్తున్నాము. మీకు పంపిస్తాము.

బైబిలు గ్రంధాలన్నిటిలోకల్లా చిన్న గ్రంధం యోహాను 3 వ పత్రిక., సారాంశంలో పెద్ద గ్రంధము, ప్రత్యేకమైనది. ఆత్మకు మంచి ఆహారం లాంటిది. బైబిల్లో 64వ పుస్తకం. యోహాను భక్తుని ఎంతో ప్రియమైన వ్యక్తి గాయు అనే విశ్వాసికి రాసిన ఉత్తరం. 1కొరింథి 1.14 ...'గాయు'నకును తప్ప మరెవరికినీ నేను బాప్తిస్మమియ్యలేదు. రోమా 16.23 నాకునూ యావత్సంఘమునకు ఆతిధ్యమిచ్చు 'గాయు' ను మీకు వందనములు చెప్పుచున్నాడు, అంటూ అపోస్తులడయిన పౌలు 'గాయు' అనే ఈ విశ్వాసి, ఆతిధ్యమివ్వటంలో అందెవేసిన చెయ్యి అని తెలియజేస్తున్నాడు. అంతమాత్రమే కాదు ప్రభువుకు ప్రియమైన శిష్యుడు భక్త యోహానయితే, యోహానుకు ప్రియమైన వాడు గాయు. ఈ చిన్ని లేఖలో 4 సార్లు 'ప్రియుడా' అనే మాటలు గమనిస్తే భక్తుడు ఎంత ఇతణ్ని ప్రేమించాడో అర్ధమవుతుంది. (వ. 1 – ప్రియుడైన గాయునకు, 3వ. – ప్రియుడా, 5వ. – ప్రియుడా, 11వ. – ప్రియుడా) యోహాను పరిచర్య ద్వారా రక్షింపబడి ఉండొచ్చు, అందుకే ఆయన ప్రియమైన పిల్లల్లో ఒకడని. ఆ తరువాతి కాలంలో యోహానుకు తను స్టెనోగా కూడా సేవలో సాయపడివుంటాడని బైబిలు పండితుల అభిప్రాయం. దేవునికి నమ్మకమైన, దైవజనులు ప్రేమించిన ఓ మంచి విశ్వాసి అనేది అర్ధమవుతుంది.



భక్త యోహాను రాసిన

***1వ పత్రిక*** – దేవునితోఉన్న ఐక్యత.

***2వ పత్రిక*** – అబద్ధ బోధకులతో ఉన్న ఐక్యత –

***3వ పత్రిక*** – విశ్వాసులలో గల ఐక్యతను గురించి చదువుతాము

ఈ పత్రిక ముఖ్య సందేశం – **సత్యమును అనుసరించి నడవటం.** హెబ్రీ 13. 1, 2 ***సహోదర ప్రేమ నిలువరముగా ఉండనీయండి. ఆతిధ్యం చేయ మరువకండి, దాని వలన కొందరు ఎరుగకే దేవదూతలకు ఆతిథ్యమిచ్చారు.*** విశ్వాసులకు తండ్రియైన అబ్రాహాము ఆతిథ్యాన్ని గురించి ఈ మాట చెప్పబడింది. సువార్త దండయాత్రలో సేవకులకు గాయు అనే ఈ విశ్వాసి ఎంతగానో సహకరించాడని సాయపడ్డాడని అర్ధమవుతుంది.

నా చిన్న తనంలో మా గ్రామానికి ఒంగోలు పట్టణం నుండి సువార్త దండయాత్ర కోసం సైకిళ్ల మీద కొందరు సోదరులు బృందంగా వచ్చేవారు. ఆ సేవకోసం మా అమ్మ నాన్న కొన్ని నెలల ముందు నుండే సిద్ధపడేవారు. విగ్రహారాధన కుటుంబంలోనుండి ప్రభువునందు విశ్వాసముంచిన నాన్న గారికి ఆ చుట్టు ప్రక్కల గ్రామాలన్నీ సువార్త ప్రకటించటం అంటే ఎంత సంతోషించేవారో! వారు మా వద్ద ఉన్నన్ని రోజులు వారికి మా ఇంటిలో ఆతిథ్యమిచ్చేవారు. చిన్న పిల్లలంగా ఎన్నో పనుల్లో మేమూ సాయపడే వారం.

మరోమాట చెప్పనా? మా పెరట్లో కాచిన ఏ కూరగాయలైనా మొట్టమొదటిది దేవుని మందిరానికి వెళ్లాలి. మా అమ్మమ్మ ఇంటిలోనే చాలా కోళ్లు పెంచేది. మొదటి ప్రతి గుడ్డు మందిరానికే, పుట్టిన కొడిపిల్లలు పెరిగిన తరువాత వాటిలో ఒకటి మందిరానికే. మా అమ్మ ఆ విషయాలు ఉగ్గుపాలతోనే నేర్పింది. ఈ రోజున మేమందరమూ ఆశీర్వదించబడటానికి కుటుంబంగా మేమిచ్చిన ఆతిధ్యం, మా అమ్మనాన్నలు దేవునికివ్వటంలో మాకు నేర్పిన విషయాలు.

సరే, యోహాను రాసి ఈ పత్రికలో ముగ్గురు వ్యక్తులను గురించి మనం చదువుతాము.

1) గాయు

2) దియొత్రెఫే

3) దేమేత్రి

అంతేకాదు ఈ ముగ్గురిని గురించిన మూడు విశేషాలు కూడా మనం చదువుతాము.

1) గాయుకు అభినందన

2) దియొత్రేఫే కు విమర్శ

3) దేమేత్రికు ప్రశంస

గాయు అనే లాటిన్ పేరుకు సంతోషము అనే ఒక అర్ధం ఉంది. గాయులోని మూడు ఆధ్యాత్మిక లక్షణాలు

1) ఆత్మలో వర్ధిల్లుతున్నాడు

2) సత్యమును అనుసరించి నడుచు కొనుచున్నాడు

3) విశ్వాసికి తగినట్టుగా చేస్తున్నాడు.

**ఆత్మలో వర్ధిల్లుట**

ప్రభువైన యేసు క్రీస్తువారు బాలుడుగా నున్నప్పుడు ఆయన నాలుగు విషయాల్లో వర్ధిల్లాడు, అభివృద్ధి చెందాడు అని చదువుతాం. లూకా 2.52 యేసు

1) జ్ఞానంలో

2) వయసులో

3) దేవుని దయలో

4) మనుష్యుల దయలో వర్ధిల్లుతున్నాడు.

ప్రియ పాఠకులారా దేవుని బిడ్డలు వర్ధిల్లేవారుగా ఉండాలని దేవుడు కోరుతున్నాడు. కీర్తన 35.27 తన సేవకుని క్షేమమును (అభివృద్ధిని, ఎదుగుదలను) చూచి ఆనందించు యెహోవా ఘనపరచ బడును గాక!

గాయు ఆత్మలో వర్ధిల్లుతున్నాడు. ఓ వ్యక్తి వ్యాపారం ప్రారంభించి, బాగుంటే వర్ధిల్లుతున్నాడు అంటాము, అంటే ఏదో ఒక రోజు ప్రారంభించాడు. అది రోజు, రోజుకు వర్ధిల్లుతుంది. అలాగే మన ఆత్మసంబంధమైన జీవితం ఏదో ఒక రోజున ప్రారంభించినదై ఉండాలి. కొంచెం వివరంగా చెబుతాను. దేవుని ఆజ్ఞను అతిక్రమించిన మానవుని ఆత్మ చచ్చిన స్థితిలో ఉంది. ఎఫెసి 2.1 ***పాపముల చేతను, అపరాధముల చేతను మీరు చచ్చినవారైయుండగా...*** దేవుని వాక్యంలో మరో చక్కని మాట ప్రభువైన యేసుక్రీస్తు అన్నారు. ***నేనే మార్గము, సత్యము, జీవము.*** గమనించాలి. చచ్చిన ఆత్మకు కావల్సింది జీవము. ఎవరైతే యేసయ్య ఇచ్చే రక్షణ, పాపక్షమాపణను స్వీకరిస్తారో వారే ఆత్మలో మరలా బతికినవారు. ఆత్మలో అభివృద్ధి చెందాలంటే ముందుగా నీవు ఆత్మలో బతికించబడాలి. నీవు ఆత్మలో బతికించ బడ్డావా? దైవాశీస్సులు.



ఆర్.ఎలూజై

# ప్రభువుకే వదిలేద్దాం!

మహా పరాక్రమశాలియైన రెండవ యరోబాము, ఇశ్రాయేలు దేశాన్ని పరిపాలించిన కాలంలో, పావురం అనే అర్థమిచ్చు పేరుగల ప్రవక్త ఒకడు ఆ దేశంలో నివసిస్తూ ఉండేవాడు. పావురంలాంటి నిష్కల్మషమైన మనస్సుతోనే పరిచర్యను కొనసాగించిన ఆ ప్రవక్త, సారెపతు గ్రామానికి చెందిన విధవరాలి కుమారుడేనని, (OT History - Mc KIBBIN) చిన్నతనంలోనే ప్రాణము నిలువజాలనంత వ్యాధి గలవాడైనప్పుడు, ప్రవక్తయైన ఏలియా ప్రార్థనలతో ప్రాణం పోసుకున్నాడనీ (1రాజులు 17:17), ఆ తరువాత కాలంలో అతని శిష్యునిగా పరిచర్యలో కొనసాగాడనీ యూదులు భావిస్తారు.

(క్రీస్తు పూర్వం 790–750 సం॥ రాల నడుమ) రాజైన రెండవ యరోబాము ఏలుబడిలో, దేవుడు ఈ ప్రవక్త ద్వారా సెలవిచ్చిన మాటచొప్పుననే, దేశపు సరిహద్దులన్నీ తిరిగి ఇశ్రాయేలువారి స్వాధీనమయ్యాయని దైవగ్రంథంలో పేర్కొనబడింది. (2 రాజు 14:25) సొలొమోను కాలంనాటి సరిహద్దు గ్రామాలన్నింటినీ, శత్రుదేశమైన అష్షూరు ఆధీనంలోనుంచి, తిరిగి స్వాధీనం చేసుకోవడంలో, ఈ ప్రవక్త పాత్ర మరువలేనిదనీ, బహుశా ఇతడు రాజుకు సలహాదారుగా ఉండి ఉంటాడనీ చరిత్రకులు అంటుంటారు. అంతటి ప్రవక్తకూ ఇప్పుడు ఒక పెద్ద చిక్కొచ్చిపడింది.

### ప్రభువు వాక్కు

ఒకరోజు దేవుని వాక్కు అతనికి ప్రత్యక్షమై, **'లేచి నీనెవె మహా పట్టణమునకు పోయి దానికి దుర్గతి కలుగునని ప్రకటింపుము'** (యోనా 1:2) అని సెలవిచ్చే సరికి ప్రవక్తకు ఏమీ పాలుపోలేదు. ఒకవైపు చూస్తే, సరిహద్దు గ్రామాలన్నీ అష్షూరు వారి బంధాకాలలో నుండి ఇప్పుడిప్పుడే బయటపడ్డాయి. దేశంలో సాధారణ పరిస్థితులు నెమ్మదిగా నెలకొంటున్నాయి. ఇలాంటి పరిస్థితిల్లో, శత్రుదేశపు (అష్షూరు) ప్రధాన పట్టణమైన నీనెవెకు వెళ్ళి దానికి దుర్గతి కలుగుతుందని ప్రకటిస్తే వాళ్ళు ఊరుకుంటారా! అసలే దయాదాక్షిణ్యాలు లేనివారు, వారిని వ్యతిరేకించే వారి ప్రాణాలు తీయడానికి కూడా వెనుదీయని వారు.



వారికే చెడు జరుగుతుందని ప్రకటిస్తే ఎలా ఊరుకుంటారు!

## ప్రభువు కరుణ

మరోవైపు చూస్తే, **'ప్రవక్త చెప్పిన మాట జరుగక పోయిన యెడల అది దేవుడు చెప్పిన మాటకాదు, ఆ ప్రవక్త అహంకారము చేతనే దానిని చెప్పెను.'** (ద్వితీ18:22) అని మోషే ముందుగానే చెప్పాడు. దేవుడు కరుణా కటాక్షములు గలవాడు గనుక నీనెవె వారిని తప్పకుండా క్షమిస్తాడు (యోనా 4:2) అలాగే జరిగితే గనుక నేను ప్రకటించిన వార్త కాస్తా అసత్యమై పోతుంది. జనులు నన్ను అహంకారిగానూ, అబద్ధికునిగానూ పరిగణిస్తారు. భౌతికంగా అన్యుల చేతిలో చావడం లేదా ఆత్మీయంగా అయిన వారి మధ్యన చావడం ఏదో ఒకటి తప్పేలా లేదు. ఇంత పరిచర్య చేసిన తరువాత అంతులేని ఆవేదనే మిగిలేలా ఉంది అని అనుకున్నాడో, అష్షూరీయులు మార్పునొంది బలపడితే దేశానికి ముప్పు తప్పదు అని అనుకున్నాడో గానీ, దేవుని సన్నిధిలో నిలువక తర్షీషుకు పోయేందుకు ఓడనెక్కాడు ప్రవక్త. (యోనా 1:3)

## ప్రభువు చిత్తము

ఆ తరువాత సముద్రంలో తుఫాను రేగడం, ఓడ బద్ధలై పోయే గతి రావడం, నావికులు చీట్లు వేయడం, చీటి యోనా మీదకు రావడం, తుఫాను తగ్గేందుకు యోనాను సముద్రంలో పారవేయడం, మత్స్యం అతడిని మ్రింగివేయడం, ఆనక తీరిగ్గా తన క్షేమం కన్నా దైవ చిత్తమే ప్రాముఖ్యమనే విషయాన్ని అతడు గ్రహించడం, మత్స్యగర్భాన్నుంచి బయటపడిన తరువాత నీనెవెకు వెళ్ళి దేవుడు సెలవిచ్చిన సమాచారాన్ని ప్రకటించడం లాంటి విషయాలన్నీ మనకు చిరపరిచితమైనవే.

## ప్రభువు పరిచర్య

ఇంతకూ ఈ నీనెవె పట్టణ వైశాల్యమెంత? ప్రవక్త దేవుని సమాచారాన్ని ప్రకటిస్తూ పయనించిన భాగమెంత? దేవుని యెదుట పరాక్రమశాలిగా పేరొందిన నిమ్రోదు నిర్మించిన ఈ పట్టణం (ఆది 10:11) మూడు దినముల ప్రయాణమంత విశాలమైంది. యూదుల లెక్కల ప్రకారం రోజుకు 20 మైళ్ళు నడవగలుతామనుకుంటే, ఈ పట్టణం 60 మైళ్ళ చుట్టుకొలత గల పట్టణమనీ, 100 అడుగుల ఎత్తు, 50 అడుగుల వెడల్పు గల రక్షణ గోడ ఈ పట్టణం చుట్టూ కట్టబడిందనీ ప్రాచీన కాలపు రచయిత (Diodorus Siculus) పేర్కొంటాడు. తిగ్రీతు (Tigris) నదీ తీరాన ఉన్న మూడు దినముల ప్రయాణమంత విశాలమైన ఈ పట్టణంలో (యోనా 3:3), ప్రవక్త ఒక్కదిన ప్రయాణమంత దూరం పరిచర్య చేసేసరికి (యోనా 3:4) అంటే మూడోవంతు పని పూర్తి చేసేసరికి, పట్టణమంతా మారిపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది.

## ప్రభువు కార్యము

ఏతావాతా, యోనా జీవిత అనుభవాల నుంచి అర్థమయ్యేదేంటంటే, వ్యక్తిగత, సామాజిక ప్రాధాన్యతల కన్నా, దైవిక ఆధ్యాత్మిక ప్రాధాన్యతలే మిన్నయైనవనీ దైవ సంకల్పాన్ని నెరవేర్చడానికి చేపట్టే చర్యల్లో ఒక చిన్న (మూడోవంతు) భాగమైనా పూర్తి చేయగలిగితే ఫలితం దానంతట అదే వస్తుందనీ అర్థమవుతుంది. శరీరాత్మ మనస్సుల్లో, మనసు మారితే మిగిలిన వాటి విధి విధానాలన్నీ అద్భుతంగా మారిపోతాయనీ అర్థమవుతుంది. మరి గణితశాస్త్ర సిద్ధాంతాల ప్రకారం లెక్కిస్తే యోనా చేసిన పరిచర్య 33.3 శాతమే అవుతుంది. ఆ మాటకొస్తే, మనసు మారడమనేది సంపూర్ణంగా జీవితం మార్పు చెందడంలో 33.3 శాతమే అవుతుంది. అలాగే 'నేను నాటితిని, అపొల్లో నీరు పోసెను, వృద్ధి కలుగజేసినవాడు దేవుడే' (1 కొరింథీ 3:6) అంటూ పౌలు చెప్పిన మాటల్లోనూ వ్యక్తిగతంగా ఒక్కొక్కరు చేసిన పని 33.3 శాతమే అని అర్థమవుతుంది. యేసు ఈ లోకంలో జీవించిన కాలం కూడా 33.3 సంవత్సరాలేనని జ్ఞాపకానికొస్తుంది. ఇలా ఆలోచిస్తూ పోతే, ఈ అంకెలన్నింటికీ లింకులెప్పటికయినా దొరుకుతాయి గానీ, అందుకు ముందుగా వ్యక్తిగత సామాజిక అనుభవాలలో మనవంతు పాత్ర మనం పూర్తిచేయాలని ప్రభువిచ్చే పిలుపును శిరసావహిద్దాం. ఒకరి వంతు ప్రార్థిద్దాం. మరొకరి వంతు పనిచేద్దాం. మిగిలిన వంతు ప్రభువుకే వదిలేద్దాం. దేవునికి స్తోత్రాలు. ఆమేన్.

# యువ స్పందన



రెవ. టి. యస్. ఆర్. ప్రసాద్‌రెడ్డి

# మనో దృష్టి

**"వ్యర్థమైన వాటిని చూడకుండ నా కన్నులు త్రిప్పివేయుము"** కీర్తన 119:37

మహోన్నతుడైన దేవుడు బైబిల్ గ్రంధములో మహాభక్తుల జీవిత చరిత్రలతో పాటు, వారి ప్రార్థనా జీవితములను గూర్చి కూడా ఎంతో స్పష్టంగా వ్రాయించి ఉంచాడు. ప్రార్థనా సమయంలో ఆ భక్తులు దేవుని సాన్నిధ్యంలో ప్రార్థించిన అంశములను గూర్చి ధ్యానించమని పరిశుద్ధాత్మ దేవుడు మనకు బోధిస్తున్నాడు.

మహాభక్తుడైన దావీదు రచించిన ప్రార్థనా కీర్తనలలో 119 వ కీర్తన సార్వత్రిక క్రీస్తు సంఘమంతటికీ ఎంతో ప్రయోజనకరమైనది.

ఈ ప్రార్థనా కీర్తనలో భక్తుడైన దావీదు దైవసాన్నిధ్యంలో ఎన్నో ప్రాముఖ్యమైన ఆధ్యాత్మిక సంగతులను గూర్చి ప్రార్థిస్తూ, 37వ వచనంలో **"వ్యర్థమైన వాటిని చూడకుండ నా కన్నులు త్రిప్పివేయుము"** అని వేదనతో ప్రార్థిస్తున్నాడు.

దావీదు భక్తుడు ఎందుకని ఇంతగా ఆక్రందిస్తున్నాడు? వ్యర్థమైన వాటిని చూడటం వలన అతనికి కలిగే నష్టమేమిటి? వ్యర్థమైన వాటిని చూడకూడదని అనుకున్నప్పుడు, తానే ఆ వ్యర్థమైన వాటివైపునుండి తన కన్నులను త్రిప్పివేసుకోవచ్చుకదా? దాని కొరకు దేవునికి ప్రార్థించటం ఎందుకు? ఆ ప్రార్థనను పరిశుద్ధాత్మ దేవుడు బైబిల్ గ్రంధంలో మనకోసం వ్రాయించటం ఎందుకు?

అన్నీ ప్రాముఖ్యమైన ప్రశ్నలే! కాని ఒక ప్రాముఖ్యమైన సత్యం ఏమిటంటే - వ్యర్థమైన వాటివైపునుండి మన కన్నులను త్రిప్పేసుకోవటం మన వలన అయ్యేపనికాదు. ఒకవేళ అది మనవలన కాగలిగే పనే అయితే దానిని గూర్చి బైబిల్‌లో వ్రాయబడనవసరం లేదు.

బహుశా దావీదు భక్తుడు వ్యర్థమైన వాటివైపు నుండి తన కన్నులను త్రిప్పుకోవాలని ఎంతో ప్రయత్నించాడు, అయినా అది తనంతట తానుగా సాధించలేని ఆధ్యాత్మిక అంతస్థు అని గ్రహించి సమయోచిత సహాయం కొరకు దేవుని అర్థిస్తున్నాడు. మనం చేసుకోగలిగిన, చేయగలిగిన చిన్న చిన్న కార్యముల కోసం మనం ప్రార్థన చేయము. మనంతట మనం సాధించలేని కార్యములను గూర్చి మాత్రమే మనం ఎక్కువగా ప్రార్థిస్తూ ఉంటాయి.

ఇక్కడ మనం గమనించవలసిన ముఖ్య విషయం ఒకటి ఉంది. అదేమంటే, దేవుడు మన శరీరాన్ని ఎంతో జ్ఞానంతో నిర్మించాడు. మనం ఎటువైపుకు చూస్తున్నామో అటువైపుకే నడవగలము. మనం వెనక్కి చూస్తూ ముందుకు నడవలేము.



## ఇహలోక దృష్టి

మనం పరలోక రాజ్యపౌరులం. ఈ లోకపు ఐగుప్తు నుండి పరమకానానుకు ప్రయాణిస్తున్న కానాను యాత్రికులం. దేవుని రాజ్య వారసులం. మనం పరమా కానానుకు ప్రయాణిస్తున్న యాత్రికులం గనుక మన కనుదృష్టి నిత్యమూ పరలోకం వైపుకే ఉండాలన్నిది దేవుని ఉద్దేశ్యం. మనం ఈ లోకం వైపుకు చూస్తూ పరలోకరాజ్యం వైపుకు క్షేమకరంగా నడవటం లేదా యాత్రకొనసాగిచటం అసాధ్యం కనుకనే దావీదు వ్యర్ధమైన ఈ లోక సంగతుల వైపు నుండి తన కన్నులను త్రిప్పివేయమని దేవునికి ప్రార్ధిస్తున్నాడు.

ఇంతకు 'వ్యర్ధము' అంటే అర్ధమేమిటి? వ్యర్ధము అంటే నిష్ప్రయోజనమైనది, ఎప్పటికీ పనికిరానిది అని మనం నిఘంటవు ప్రకారం అర్ధం చెప్పుకోవచ్చు, కానీ ఈ "వ్యర్ధము" అనే పదానికి దైవలేఖనం చెబుతున్న అర్ధమేమిటి? ప్రసంగి 1:14 గమనిస్తే ***"సూర్యుని క్రింద జరుగుచున్న క్రియలన్నీ వ్యర్ధమే!"*** అని పరిశుద్ధాత్మ దేవుడు చెబుతున్నాడు. సూర్యునికి క్రింద అనగా ఈ భూమ్మీద జరుగుచున్న క్రియలన్నియు వ్యర్ధమైనవి అని వివరిస్తున్నాడు. అంటే దావీదు భక్తుడు తన కండ్లను, మనస్సును ఈ భూసంబంధమైన వ్యర్ధమైన వాటన్నిటి వైపునుండి సూర్యునికి పైగా పరలోకసంబంధమైన వాటి వైపుకు త్రిప్పమని దేవునికి ప్రార్ధిస్తున్నాడు.

## పరలోక దృష్టి

నీ మనస్సు అధిక సమయం దేనిపైన ఉంచుతావో దానిని బట్టే నీ ఆత్మీయ జీవిత క్షేమాభివృద్ధి ఆధారపడి ఉంటుంది. అందుకే పరిశుద్ధాత్మ దేవుడు పౌలుభక్తుడు ద్వారా (కొలస్సీ 3:1-3) ***"పైనున్న వాటినే వెదకుడి... పైనున్న వాటి మీదనే గాని భూసంబంధమైన వాటి మీద మనస్సు పెట్టుకొనకుడి"*** అని క్రొత్త నిబంధన సంఘానికి ఖండింతంగా ఆజ్ఞాపిస్తున్నాడు. పైనున్న (పరలోక సంబంధమైన) వాటినే వెదకమన్నాడు. పైనున్న వాటి మీదనే మనస్సు పెట్టమన్నాడు. భూసంబంధమైన (వ్యర్ధమైన) వాటి మీద మనస్సు పెట్టకూడదని చాలా స్పంష్టంగా ఆజ్ఞాపిస్తున్నాడు. ప్రార్ధనా పూర్వకంగా ఆలోచించండి.

ఎందుకంటే విశ్వాసి ఆధ్మాత్మిక జీవితానికి క్షేమాభివృద్ధిని కలిగించేవేవీ ఈ భూమ్మీద ఉండవు. ఈ లోక సంగతులన్నీ విశ్వాసిని పరిశుద్ధుడైన దేవునికి దూరం చేయగలవే తప్ప, దేవునికి దగ్గర చేయలేవు. ఈ భౌతిక ప్రపంచపు సంగతులలో ఏ ఒక్కటీ విశ్వాసిని ప్రార్ధనా జీవితంలో ఉన్నతదశకు చేర్చలేవు, పరిశుద్ధునిగా చేయలేవు.

యాకోబు పత్రిక మొదటి అధ్యాయం 17వ వచనంలో ***"శ్రేష్టమైన ప్రతి ఈవియు, సంపూర్ణమైన ప్రతి వరమును పర సంబంధమైనదై జ్యోతిర్మయుడైన తండ్రి వద్దనుండి వచ్చును"*** అని వ్రాయబడి ఉంది. అంటే ఈ లోకంలో జీవిస్తుండగా విశ్వాసికి కావలిసిన ఆత్మసంబంధమైన సహకారం, ప్రతి ఆశీర్వాదం పరలోకం నుండి రావలిసిందే! విశ్వాసి పొందుకోవలసిని ప్రతీ శ్రేష్టమైన వరము పరలోకపు తండ్రి వద్దనుండే రావాలి.

విశ్వాసికి కావలసిన ఆధ్యాత్మిక దీవెనలు, వరములు ఈ లోకంలో దొరికేవి కావు, కనుక తన మనోనేత్రాలను, భౌతిక నేత్రాలను దేవునివైపు నిలుపుకోవాలి, పరమతండ్రి వైపుకే తన దృష్టిని సారించాలి. అప్పుడే విశ్వాసి ఆధ్యాత్మిక జీవిత యాత్ర క్షేమంగా కొనసాగుతుంది.

## మనోనేత్రాలు

బాల్యంనుండి ఈ లోక సంబంధమైన వాటిని చూడటానికి అలవాటుపడిన మన మనోనేత్రాలను, మన మనస్సును ఒక్కసారిగా పరలోక సంబంధమైన మహిమకరమైన సంగతులవైపుకు మన దృష్టిని ఏకాగ్రతగా స్థిరపరచటం అసాధ్యం! అందుకే దావీదు భక్తుడు దేవుని సహాయం కొరకు ప్రార్ధిస్తున్నాడు. ప్రార్ధన ద్వారా మనకు సాధ్యం కాని కార్యం ఏదీ ఉండదని మనకు తెలుసు. ఈ ప్రాముఖ్యమైన ఆధ్యాత్మిక అంతస్థు సాధించటానికి మనం దేవుని సహాయం కొరకు ఆక్రందన చేయాలి. మన దృష్టిని శ్రేష్టమైన శాశ్వతమైన మహిమలోకం వైపుకు స్థిరపరచమని దైవసాన్నిధ్యంలో కన్నీటితో పట్టుదలతో ప్రార్ధించాలి. ఆ మహోన్నత ఆధ్యాత్మిక అంతస్థును సాధించాలి. మనలో ఈ ఆధ్యాత్మిక పరివర్తన రావాలన్నదే దేవుని మనోవాంఛ! దైవాశీస్సులు.

***ఐగుప్తును విడచినట్టి మీరు -***
***అరణ్యవాసులే ఈ ధరలో -***
***నిత్యనివాసము లేదిలలోన -***
***నేత్రాలు కానాను పై నిల్పుడి"***

## నూతన సంవత్సరానికి నిరసన కాంక్షలు హితవత్సరానికి శుభాకాంక్షలు

నూతన సంవత్సరమా!
కొన్ని నెలలకు పాతబడి
పన్నెండు నెలలకు పనికిరాని వస్త్రమా!

నీవు శుభములు తెస్తావని
ప్రజలు శుభాకాంక్షలు చెప్పుకొంటున్నారు
నీవు ఆశీర్వాదాలిస్తావని ఆశీస్సులు తెలుపుకుంటున్నారు
ఎన్నో ఆశలతో ఒకరినొకరు ఆహ్వానించుకుంటున్నారు

నీవు అందర్ని సమానంగా చూడవని ఎందరికో తెలియదు
ఎవరి మెడలో తాళిగడతావో - ఎందరి తాళ్ళు
తెంపివేస్తావో
అమాయక ప్రజలెరుగక - నిన్నాహ్వానిస్తుంటారు

ఎవరికి ఆనందమిస్తావో - ఎవర్ని అల్లాడిస్తావో
ఎవరికి భవనం కడతావో - ఎవరి భవిష్యత్
కూలగొడతావో
ఎవర్ని మింటికెత్తుతావో - ఎవర్ని మట్టిలో కప్పెడతావో -
ఎవరికి తెలుసు?

నూతన సంవత్సరమా! నీవు ప్రతి ఏటా వస్తావు
ఎందరి ప్రాణాలో హరిస్తావు
భర్తపోయిన పిల్ల భోరుమన్నా
బిడ్డపోయిన తల్లి బావురుమన్నా
నీకు చీమ కుట్టినంత చింతకూడా లేదుగదా!

ఒక ఇంట్లో వివాహ వేడుకలు
ప్రక్కింటిలో మరణ రోదనలు
ఎవర్ని మంత్రిని చేస్తావో
ఎవర్ని మంచము పట్టిస్తావో
ఎందుకు నా రాక! కొందరికే నీ ఆనందం!

నూతన సంవత్సరమా! ఇది నీకు నా నిరసన
నీవు మాకు వద్దు - ఇక రావద్దు
నా ప్రభువు తెసాన్న హితవత్సరం కోసం
ఎదురుచూస్తున్నాము
వస్తానన్న మా ప్రభువు వస్తే - నీవు తెచ్చిన
మనో వేదనలన్నీ మేము మరచిపోయేలా చేస్తారని
ఎదురుచూస్తున్నాం!

- పాస్టర్ గుండాబత్తిని దేవదానం

## బృందావనం

ఆంధ్రుల అభిమాన నందన వనమే..!
మా ఈ స్పందన..!
నీతి నిజాయితీలతో ప్రతి పేజీలో..!
కనిపించు ఆనందమే ఈ స్పందన..!
ప్రతిపేజీలోనూ జ్ఞానోదయమే ఈ స్పందన..!
అందించే విజ్ఞానోదయమే ఈ స్పందన..!

మలినమైన మనసుల్ని మంచి మార్గంలోనికి..!
స్పందింప చేసే మార్గదర్శకమే ఈ స్పందన..!
నీతి సూత్రాలకు నిలయం... కాంగ్రాత్త బాసలు..!
నేర్పు ప్రత్యేకమే ఈ స్పందన..!
బైబిల్ గ్రంథంలోని అక్షర సత్యాల్ని సుగంధ..!
పరిమళాలుగా అందించే గ్రంథమే ఈ స్పందన..!

అన్య జీవితాల సాక్షాలతో అంకిత సత్యాలు..!
అర్పణల ముత్యాలుగా ముద్రించు..!
అరుణోదయమే ఈ స్పందన..!
నిష్కళంకమైన నిజాల్ని నిర్మోహమాటంగా..!
అద్దంలా ప్రతిబింబించే ప్రబంధమే ఈ స్పందన..!

గడిచిన జ్ఞాపకాల్ని మనస్సనే మందిరంలో..!
ముద్రించే చిరస్మర బంధమే ఈ స్పందన..!
నిత్య జీవితంలో దయారస పాఠాలతో..!
ఆధ్యాత్మిక కథా కవిత్వాలతో కదిలించి..!
అందించే చంద్రోదయమే ఈ స్పందన..!

నూతన సంవత్సర శుభాకాంక్షలతో వందలాది..!
సంవత్సరాలు వర్ధింప జేస్తూ, క్రైస్తవుల కానుకగా..!
దేదీప్య జ్యోతిగా చంద్ర బింబంలా వెలుగునింపే..!
ఈ స్పందన..!
ఇదే మేమందించే మా కృతాజ్ఞతాభివందనాలు..!
బృందావనమే ఈ స్పందన..!!!

- శ్రీమతి.యం.నిర్మలాసుదీప్‌రెడ్డి

## వచ్చే నెల నుండి....

## 'సీనియర్ సిటిజన్స్' కోసం

**ప్రత్యేక వ్యాసాలు, చర్చలు, వారెదుర్కొనే సమస్యలకు వాక్యానుసారమైన పరిష్కారాలు**

– కొన్ని నెలల క్రితం స్పందనలో ఆరార్కే గారు రాసిన **'వృద్ధులు'** అనే వ్యాసం అనేకమందిని ఆదరించి, ధైర్యపరచిందని తెలియజేశారు. ఈ రోజున వయోవృద్ధులు ఎదుర్కొనే సమస్యలు చాలా ఉన్నాయి. విశ్వాసుల కుటుంబాల్లో సహితం అత్తకు, కోడలుకు మధ్యన సరైన అవగాహన ఉండటం లేదు. లోకస్తుల కుటుంబాల్లో, జీవితాల్లో ఎలాంటి సమస్యలున్నాయో దేవుని బిడ్డలుకూడా అదే సమస్యలతో సతమతమవుతున్నారు.

వయోవృద్ధుల బాధలు అన్నిన్ని కాదు. జీవిత చివరి ఘడియల్లో అనేకమంది ప్రశాంత లేకుండా పోతోంది. **కన్న కొడుకు *దగ్గరలేదని*** – కొందరి వేదన, ***ఉన్నా* పట్టించుకోవటం *లేదని*** మరి కొందరి ఆవేదన.

వయో వృద్ధాప్యంలోకి వచ్చిన వారికి చిన్న పిల్లలు మనస్తత్వం వస్తుందంటారు. ఈ వయసులో వారికి ఆధ్యాత్మిక సలహాలు, సంప్రదింపులు, వారి వాదనలు, మాటలు చాలా జాగ్రత్తగా వినాలి, పట్టించుకోవాలి. వారెదుర్కొనే కొన్ని సమస్యలు గమనించండి.....

– అంత వరకూ తన మాటే అధికారంలో ఉన్న అత్త గారికి కోడలు రావటంతో కొంత అనానుకూల పరిస్థితులు – పెళ్లయ్యేవరకూ మమ్మీ, మమ్మీ అంటూ అమ్మ కొంగుచాటున తిరిగే కొడుకు – అక్కా చెల్లెళ్లతో సరదాగా ఆడుతూ, పాడుతూ, జోకులు వేస్తూ ఉండే అన్నయ్య లేదా తమ్ముడు మారిపోయాడని అని ఓ తల్లి ఫిర్యాదు.

– చిన్నప్పుడు ఎంత మురికి చేసుకున్నా, తినే అన్నం పక్కన పెట్టి ఆ కొడుకు మురికినంతా ప్రేమతో కడిన తల్లి, వృద్ధురాలయిన తరువాత డైనింగ్ టేబుల్ మీద అన్నం ప్లేటు ప్రక్కన కొన్ని మెతుకులు పడినంత మాత్రాన ఇంత ఈసడించుకుంటాడెందుకు? అర్థం కాదు ఆ తల్లికి.



– చిన్న వయసునుండి ఎంతో భయభక్తులతో పెరిగానో, ఈ వృద్ధాప్యంలో నాకీ వింత రోగం, బతికి నంత కాలం మందులు తినాల్సిన ఇలాంటి అనారోగ్యం వాట్టిల్లిందేవిటి?

అంటూ అనేక ఉత్తరాలు, ఫోన్‌లు స్పందనకు, టివి కార్యక్రమాలు వీక్షించిన వారు చేస్తుంటారు.

ఇది కడవరి కాలం, మనుష్యులు స్వార్థప్రియులు. కొన్ని విషయాలు షాక్‌కు గురయ్యేట్లు చేస్తాయి. ఇలాంటి విషయాలు విని తేరుకోవటమే కష్టంగా ఉంటుంది. – ***అత్తగారు అనారోగ్యంతో ఉంది. ఆమె 10 రూపాయలను కూడా ఎంతో జాగ్రత్తగా చూచుకునే దీనురాలు. తన హాస్పటల్ ఖర్చుల నిమిత్తం వాడుకొనేదంతా తను దాచుకున్న డబ్బే. అయినా ఆమె పోతే కోడలి పెత్తనం వస్తుందనో ఏమో తెలియదు గాని. ఆ వృద్ధురాలితో తరచూ 'మీకు నెలకు బోలెడంత డబ్బు ఖర్చువుతుంది' అని దెప్పుతూ ఉండేది. చాలా దిగులుతో ఈ లోకాన్ని విడిచింది.*** అదే ఆమె స్వంత తల్లినయితే అలా అంటుందా? అంటూ ఆమె పిల్లలు వాపోయారు.

**– స్పందన పాఠకులలో వున్న వయోవృద్ధులకు సంతోషం కలిగించే అనేక కార్యక్రమాలు ప్రభువు నామ మహిమార్థమై చేపట్టాలని ఆశిస్తూ, సిద్ధపడుతున్నాము. వయోవృద్ధులెదుర్కొనే అనేక సమస్యలకు వాక్యానుసారమైన పరిష్కారం, సూచనలు, సలహాలు. ప్రార్థించండి, ఎదురు చూడండి.**

**– మీ ఎడిటర్స్**

## దైవజనులు చెప్పిన జోకులు

**'కన్నడం' - 'కనడం'**

కర్నాటక నుండి వచ్చిన సోదరునితో
"మీకు కన్నడం వచ్చా?" అడిగారట
"నాకు రాదండీ, పిల్లల్ను కనడం మా ఆవిడికి వచ్చు" అన్నాడట అమాయకంగా....

మారిన జీవితాలు



- శ్రీమతి జయశీల

# ఆధ్యాత్మిక జ్ఞానము

**"ఆయన తన దీనురాలి దీనస్థితిని కటాక్షించెను". మత్తయి 1:47.**

నాకు రెండున్నరేళ్ల చిన్న వయసులోనే తండ్రిని కోల్పోయి దయనీయ స్థితిలో పెరిగాను. నలుగురు అక్కా చెల్లెళ్లను అమ్మ ప్రేమతో, కష్టపడి పెంచింది. వాస్తవానికి అంత తెలివిగలదాన్ని కాకపోయినా నా ప్రభువు కృపవల్లనే పాస్ అయ్యాను. మేము విగ్రహాలను ఆరాధించేవారము. ఇంటరు వరకూ తెలుగు మీడియంలో చదివి బి. కాం డిగ్రీలో ఇంగ్లీషు మీడియంలో చదువుకోటానికి చాలా శ్రమ పడ్డాను. స్నేహితులను అడిగితే చిరాకుపడేవారు, అయితే కొందరు మంచి స్నేహితులు సాయపడేవాడు. అలాంటి వారి సాయంతోనే క్రీస్తును గురించి తెలుసుకున్నాను. మేమంతా ప్రార్థన చేసికొనేవారము. స్టడీ సమయంలో గోడపై ఆనుకొని ఏడ్చి క్రీస్తును ప్రార్థించు కొనేదాన్ని. క్రీస్తుపైగల అచంచల విశ్వాసమే నన్ను అంచలంచలుగా ఉన్నత స్థలంలో నిలబెట్టింది. దేవునికే స్తుతి, ఘనత, చెల్లిస్తూ తగ్గింపుతో జీవించేదాన్ని. ప్రభువా, ఇంగ్లీషులో చదవడం చాలా కష్టగా ఉంది గనుక నాపై దయచూపి సరిగా అర్థముచేసికొనే ధన్యత నీయండి" అని ప్రార్థించుకున్నాను. నాతో చదివే ఒక క్రైస్తవ స్నేహితురాలు నన్ను ఒక ఇంగ్లీషు, ఒక తెలుగు బైబిళ్ళను దగ్గర ఉంచి చదువుకోమని సలహాయిచ్చింది. మత్తయి సువార్త నుండి ఆరంభించి, ఉపమానాలు, అన్నీ చదువగా చాలా మార్పు వచ్చి జ్ఞానోదయం కల్గింది. యిది అద్భుత కృప, డిగ్రీలో ఉత్తీర్ణురాలనై విజయవాడలో మేరీస్టెల్లా కాలేజీలో ఎం.ఎ ఇంగ్లీషులో చదవడానికి సాహసించాను. చదవడానికి క్లాసులకు వెలుతున్నా తోటివారిలా ఇంగ్లీషులో మాట్లాడటానికి గానీ, ఎవరైనా ప్రశ్నిస్తే జవాబు చెప్పడం నాకు చేత కాలేదు. స్లిప్ టెస్టులలో 10 మార్కులకు 2 లేదా 3 మార్కులు వచ్చేవి. మా లెక్చరర్లు "అమ్మా, నీకు చదువెందుకు? యింట్లో కూర్చోరాదా? అని హేళన చేసేవారు. దేవుడు తనను నమ్మినవారినెంత మాత్రమూ సిగ్గుపరచడు. నేను 53% మార్కులతో పాస్అయ్యాను ఆ తర్వాత శ్రీ చైతన్య కాలేజీలో జూనియర్ లెక్చరర్గా ఉద్యోగం దొరికింది. నా పనంతా పేపర్లు దిద్దటం, స్టడీ సమయంలో వివరించడం. నాకు మాట్లాడే సామర్థ్యం ఉండేది కాదు. సరైన ఇంగ్లీషు మాటలు రావు గనుక తెలుగులో చెప్పే వివరాలన్నీ గమనించి విద్యార్థులే నన్ను ప్రశ్నించేవారు. మేడమ్, మాకు తెలుగు రాదు. కొందరము పూనా, డిల్లీ ప్రాంతాల వారం. హిందీలో గ్రహించగలము గనుక అందరికీ అర్థమయ్యేటట్లు ఇంగ్లీషులోనే చెప్పాలన్నారు. ప్రతి క్లిష్ట సమయాల్లో విశ్వాసులనే నాకు సహాయకులుగా దేవుడే వుంచేవారు. నాతో పనిచేసే ఒక క్రైస్తవ లెక్చరరు నాకు వివరాలు చెప్పేవారు. అతి సులభంగా వివరించే నోట్సు ఇంగ్లీషులో వ్రాసి యిచ్చి, గ్రామరు వివరిస్తూ స్వల్పపద్ధతిలో సమర్థతతో వివరణ ఎలా చేయాలో చాలా శ్రద్ధతో ఓర్పుతో నేర్పించింది. దేవుడే ఆమెకు ఆ ప్రేమ నాపై కల్గించారు. నాకు లభించిన ఖాళీ సమయాల్లో దైవవాక్యాన్ని మాత్రమే పఠించేదాన్ని.

### వివాహము

నేను ఉద్యోగం చేస్తున్న రోజుల్లో నాకు వివాహం చేయాలనే ప్రయత్నాలు చేసినప్పుడు అద్భుతంగా హైదరాబాదు నుండి ఒక సంబంధం వచ్చింది. వారు మా కులంలోని వారే క్రీస్తును నమ్మిన విశ్వాసులు, లోకాశలు లేనివారై, మంచి విశ్వాసిగా నున్న అమ్మాయి, ప్రార్థన యిష్టపడేవాళ్ళే కావాలని మమ్ములను సంప్రతించారు. మా పేద స్థితిని బట్టి కట్నం యివ్వలేమని,

పెండ్లి ఖర్చులకు సొమ్ములేదని చాలా భయంతో వున్నాము. మధ్యతరగతి కుటుంబం, తండ్రిలేడు, అంతా ఆడవారమున్నాము. యీ పరిస్థితంతా వివరించాము. మా అమ్మ నాకు కాబోయే అత్తగారితో ఆమె పరిస్థితి తెల్పింది. "అమ్మా, మేము చాలా పేదవారము, చిన్నయింటిలో వుంటున్నాము. మీ అబ్బాయి అమెరికాలో ఉద్యోగిగా నుంటూ ఉన్నతస్థాయిలో జీవిస్తున్నారు. మీకు మాకు ఎట్లు పొత్తు కుదురుతుందండీ" భక్తిగల ఆమె జవాబు నన్ను చాలా ఆశ్చర్యపర్చింది. "అమ్మా, మన రక్షకుడైన క్రీస్తు ఎక్కడ జన్మించారో మీకు తెలుసుకదా! నా కేమీ కట్నకానుకలు అవసరము లేదు. మీ అమ్మాయి కేవలము మేము ప్రేమించే క్రీస్తును నమ్మిన విశ్వాసిగా ఉంటే అంతే చాలు. ఏ కట్నకానుకలపై మాకు ఆశలేదు. దైవ భయమే మాకు విలువైన అర్హతగా భావిస్తామన్నారు. పెండ్లి ఖర్చులకై మీరేమీ ప్రయాసపడవద్దు. విజయవాడలో ఒక హోటల్లో పెండ్లి చేద్దాము. మేమే మా ఖర్చులన్నీ భరిస్తాము. మీకెలాంటి చింత వద్దు'' అన్నారు. దేవునికే స్తుతి హల్లెలూయ. నా పట్ల సంపూర్ణంగా నా అవసరాలన్నీ ప్రభువే వారి ద్వారా తీర్చారు. ***కేవలం దేవుని అద్వితీయ ప్రేమ సంకల్పం వర్ణించతరమా నా క్రీస్తు ప్రేమను?*** అని పాడుకున్నాము.

## దేవుని బహుమానం - గర్భఫలం

నా పెండ్లి చాలా జయకరంగా జరిగింది. అనేక మంది విశ్వాసులు హాజరయి దీవించారు. క్రీస్తు తన చిత్తానుసారంగా మా వివాహాన్ని జరిపించారు. అద్భుతంగా ప్రేమగల ఆదర్శాలున్న విశ్వాసియైన భర్తతో అమెరికాలో నివసించడానికి వెళ్ళాను. ఎంత అద్భుతము, ఎన్నికలేని నన్ను కటాక్షించిన ప్రభువు దయ ఎంత గొప్పది? అనుదినము, అనుక్షణమూ క్రీస్తు స్మరణయే నా ఊపిరిగా జీవిస్తూ వచ్చాను. తరువాత ఎన్నో విలువైన వివరాలు, పాటలు, సందేశాలున్న, వెబ్‌సైట్‌ను కంప్యూటరులో చూచాను. ఎంతో ఆశ్చర్యంతో పుస్తకాలు చదువుటకు ఆరంభించాను. పెండ్లయిన రెండున్నర సంవత్సరాల వరకు నాకు సంతానం కలుగలేదు. ఎన్నో ఆటంకాల నెదుర్కున్నాను. గ్రేస్ విజయ ఆంటీ పుస్తకాలు ఆసక్తిగా నుండుటచే (చాలా సాక్ష్యాలు సేకరించి వ్రాసారు) అవి చదువుట ప్రారంభించాను. ఈ తరంలో యేసుసాక్షులు అనే మొదటి పుస్తకంలో మొదటి సాక్ష్యముగా డాక్టరు షీలా గారు, డాక్టరు రామ్‌గారు కలిసి 16 సుదీర్ఘ సంవత్సరాలు సంతానం లేకుండా గడిపారు. వారిద్దరి ఆదర్శం నన్ను ఆకర్షించింది. "మనకు పిల్లలను దేవుడివ్వలేదు, పర్వాలేదు. నీకు నేను, నాకు నీవు క్రీస్తుకొరకై జీవిస్తూ హబక్కుకులో చివరి వచనం నమ్ముదాం. అంజూరవు చెట్లు పూయకుండినను ద్రాక్షాచెట్లు ఫలించకపోయినా, ఏదీ లేకపోయినా యెహోవాయందు ఆనందిద్దాం" యీ మాటలు నాలో జీవం పోసాయి. నిరీక్షణతో కనిపెట్టాను. ప్రార్థించాను. రిబ్కా అక్కయ్య, ప్రెయర్‌సెల్ వారు యింకా ఎందరో విశ్వాసులు ప్రార్థించారు. డాక్టర్ దంపతులకు బాబు పుట్టాడు. సామ్యూల్ అబిషేక్ అని పేరుపెట్టారు. వీరి జీవితం నాకు స్పూర్తినిచ్చింది. ***ప్రభువు నన్ను దయతో నా దీన స్థితిలో జ్ఞాపకముంచుకొని ఒక చక్కని పాపను బహుమతిగా యిచ్చారు.*** హల్లెలూయ.

న్యూ జెర్సీలో ప్రార్థనా సమావేశాలకు అనిల్‌గారు వస్తున్నారని తెలిసి కుటుంబంతో 4 గంటలు వర్జీనియా నుండి ప్రయాణం చేసి వెళ్ళాము. అద్భుతంగా గ్రేస్ విజయాంటీని మీటింగ్‌లో చూచాను. వారి బాబు అకస్మిక మరణం వివరాలు ఫోటోలు చూచి దుఃఖపడి, ఆమెను పలుకరించి ఓదార్చినప్పుడు నా సాక్షము చెప్పాను. డాక్టరు షీలాగారు ఎవరోకాదు ఆమె స్వంత అక్కయ్య (లేటు) డాక్టరు వసంతమ్మగారి కుమార్తెగా తెలిసికొని ఫోనునంబరు తీసికొని ఇండియాలో నున్న డాక్టర్ షీలా గారితో మాట్లాడగా దేవుని స్తుతించి ఆనందించారు. నాలో క్రీస్తు నిలిపిన దీనస్థితినిబట్టి దేవుడు గొప్ప సంబంధాన్ని, గొప్ప విశ్వాసుల సహవాసాన్నిచ్చారు. నా కుమార్తె పేరు షైనీ. దేవుని వెలుగులో కాంతిలో పెరగాలని నా ఆకాంక్ష.(యెహోషువా వలే) నేను నా కుటుంబము నిరంతరము యెహోవానే సేవిస్తాము. నేను నా భర్త పాపతో క్రీస్తు సేవలో తరించే ధన్యత దేవుడివ్వాలని నా నిరంతర దీన ప్రార్థన.

(శ్రీమతి గ్రేస్ విజయగారి "భూదిగంత యేసుసాక్షులు" పుస్తకం నుండి)



రెవ॥ విఆర్కే మూర్తి

# కుటుంబ బాధ్యతలు

కీర్తన 127:4. ప్రకారం కుమారులు యెహోవా అనుగ్రహించు స్వాస్థ్యము, గర్భఫలము ఆయన ఇచ్చు బహుమానం. పిల్లలు దేవుడనుగ్రహించు ఆశీర్వాదం. తల్లిదండ్రులు దేవుడిచ్చిన బిడ్డలను బట్టి స్తుతించాలి. ఎందరో పిల్లల కొరకు ఎన్నో ప్రయత్నాలు చేసి విసిగిపోతున్నారు. దేవుడు మిమ్మును ప్రేమించి పిల్లలను ఇచ్చాడు. ఒక తల్లి ఒక బిడ్డను కన్నది అంటే భూలోక పౌరుడయ్యాడు. తిరిగి ఈ బిడ్డను దేవుని కొరకు పెంచి పరలోక పౌరునిగా చేయాలి. ఇది దేవుని చిత్తం. పిల్లలు సైతానుకు బానిసలై నరకానికి వెళ్ళకూడదు. తల్లిదండ్రులు పిల్లలను గూర్చి తీసుకోవలిసిన సంగతులను ధ్యానిద్దాం.

## మీ పిల్లల కొరకు ప్రార్థించండి

తల్లిదండ్రులు మొదట రక్షణ పొంది ఉండాలి. మీకు దేవుడుగర్భఫలం ఇచ్చిన నాటి నండే మీరు ఆ బిడ్డ విషయమై ప్రార్థించాలి. ఆ బిడ్డను పెంచటానికి దైవజ్ఞానం కొరకు దేవుని అడగాలి. చాలామంది తల్లిదండ్రులు పిల్లలు చెడిపోయిన తరువాత ప్రార్థిస్తారు. అనేకులను ప్రార్థించమని కోరుతారు. చేతులు కాలిన తరువాత ఆకులు పట్టుకుంటే ప్రయోజనం శూన్యం. మనం ప్రార్థిస్తే పిల్లలు ప్రార్థిస్తారు. మనం బూతులు మాట్లాడితే పిల్లలు బూతులు నేర్చుకుంటారు. బూతులు, తిట్లు పిల్లలు మనదగ్గరే నేర్చుకుంటారు. పిల్లలకు మంచి బాట వేయవలసినది తల్లిదండ్రులే. పిల్లల ఎదుట తల్లిదండ్రులు ఒకరిని ఒకరు చెడ్డ మాటలతో తిట్టుకుంటారు. ఆ బూతులే పిల్లలు నేర్చుకుంటారు. తల్లిదండ్రులారా! జాగ్రత్త! ఆవు చేలో మేస్తే దూడ గట్టున మేస్తుందా! ఆలోచించండి. పిల్లలను దేవుడు ఇస్తాడు వారిని దేవుని కొరకు పెంచాలి. ఈ రోజుల్లో పిల్లలను కనటం తేలికే కాని పెంచటం కష్టమైపోయింది. పిల్లల కొరకు ప్రతిదినం ప్రార్థించాలి. వారిని గమనిస్తూ ఉండాలి. పిల్లలు వయస్సులో ఎదుగుతూ ఉండగా తల్లిదండ్రులు వారి ఆత్మీయ జీవితం కొరకు, చదువుల కొరకు, ఆరోగ్యం కొరకు, పవిత్రంగా జీవించటానికి ప్రార్థించాలి. యవతీ, యువకులు చెడిపోవడానికి కారణం తల్లిదండ్రులే. పిల్లలుగా ఉన్నప్పుడు అశ్రద్ధ చేస్తే పెద్దవారైన తరువాత చెడిపోతారు. పిల్లల విషయం అనుదినం ప్రార్థించాలి.



## మీ పిల్లలను దేవుని యొద్దకు నడిపించండి.

తల్లిదండ్రులారా దేవుడు మీ కిచ్చిన పిల్లలను దేవుని యొద్దకు తేవాలి. అప్పుడు దేవుడు వారిని దీవిస్తాడు. వారు దీవింపబడతారు. మార్కు 10:13. ***"తమ చిన్న బిడ్డలను ముట్టవలెనని కొందరాయన యొద్దకు వారిని తీసుకొని వచ్చారు. ఆయన ఆ బిడ్డలను ఎత్తుకొని, కౌగిలించుకొని వారిమీద చేతులుంచి ఆశీర్వదించాడు".*** తల్లిదండ్రులు తమ పిల్లలను వినోదాలకు, విహార యాత్రలకు, అనేక స్థలాలకు తీసుకవెళ్తారు కాని దేవుని యొద్దకు తీసుకురారు. దేవుడు పిల్లలను ఆశీర్వదించాలని కోరుకొనరు. పిల్లలు ఆధ్యాత్మికంగా ఎదుగుటకు తల్లిదండ్రులు ప్రయాసపడాలి. తల్లిదండ్రులు ప్రభువును ఆరాధిస్తే పిల్లలు కూడా ఆరాధన అనుభవాలు నేర్చుకుంటారు. పిల్లల చదువు విషయమై ఎంత శ్రద్ధ తీసుకోవాలి. చాలమంది తల్లిదండ్రులు పిల్లల బౌతిక విషయములలో శ్రద్ధ తీసుకుంటారు కాని ఆధ్యాత్మిక విషయములలో నిర్లక్ష్యము చేస్తారు. అందుకే పిల్లలు చెడిపోతున్నారు. మొక్కై వంగనిది మ్రానై వంగునా అంటారు గదా! అవును. పిల్లలుగా ఉన్నపుడే వారికి ప్రార్దన, స్తుతులు చెల్లించుట, వాక్యము, పాటలు నేర్పాలి. పిల్లలుగా ఉన్నప్పుడే శ్రద్ధ తీసుకోవాలి. ప్రభువు యొద్దకు నడిపించాలి. పిల్లలకు ఎబిసిడీలు నేర్పుతాము మంచిదే నేర్పవలసినదే. అదే సమయంలో దేవుని వాక్యం నేర్పుతున్నామా? ఆరాధనకు మందిరమునకు తీసుకవస్తున్నామా? ఇలా చేయకపోతే పిల్లలు పాడైపోతారు. చెడిపోతారు. చివరికి తల్లిదండ్రుల మీద తిరుగుబాటు చేస్తారు. చెడ్డపేరు తెస్తారు. పిల్లలకు మాదిరి తల్లిదండ్రులే. తల్లిదండ్రులకు ఉన్న అలవాట్లే పిల్లలకు వస్తాయి. తల్లిదండ్రులు ఏమి చేయటం పిల్లలు చూస్తారో పిల్లలు అదే చేస్తారు. తల్లిదండ్రులు దేవున్ని ఆరాధిస్తే పిల్లలు ఆరాధన క్రమం నేర్చుకుంటారు. తల్లిదండ్రులు కొట్టుకుంటూ, బూతులాడుకుంటూ, మత్తుపానీయాలు సేవిస్తూ, చెడ్డ పుస్తకాలు చదువుతూ, చెడ్డవాటిని చూస్తూ ఉంటే పిల్లలు కూడా అదే బాటలో నడుస్తారు. పిల్లలు చెడు నేర్చుకున్న, మంచి నేర్చుకున్న తల్లిదండ్రులే దానికి బాధ్యులు. మన పిల్లలు మంచి నేర్చుకోవాలి అంటే మంచిగా బ్రతకాలి. తల్లిదండ్రులే పిల్లలకు మాదిరి.

ఎఫెసీ 6:4 ***"తండ్రులారా మీ పిల్లలకు కోపము రేపక ప్రభువు యొక్క శిక్షలోను, బోధలోను వారిని పెంచండి"*** తల్లిదండ్రులు మొదట వాక్యము చదువుట, ప్రార్ధించుట, అనుదినం ప్రభువును స్తుతించుట, ఆరాధించుట ఈ క్రమశిక్షణ కలిగి ఉంటే పిల్లలు కూడా ఈ క్రమశిక్షణ కలిగి ఉంటారు. ద్వితి. 11:18-20, ***"కాబట్టి మీరు ఈ నా మాటలు మీ హృదయంలోను, మీ మనస్సులోను ఉంచుకొని నీవు నీ ఇంట కూర్చుండునప్పుడు, త్రోవను నడుచునప్పుడు, పండు కొనునప్పుడు వాటిని గూర్చి మాట్లాడుచు, మీ పిల్లలకు నేర్పి నీ యింటి ద్వారబంధముల మీదను, నీ గవునుల మీదను వాటిని వ్రాయవలయును.*** తల్లిదండ్రులు పిల్లలను వాక్య క్రమశిక్షణలో పెంచవలయును. పిల్లలు దేవుడు వాడుకునే సాధనాలుగా మార్పు చెందాలి. సైతాను ఏజెంట్లు కాకూడదు. ఇది తల్లిదండ్రుల గొప్ప బాధ్యత. తల్లిదండ్రులు రక్షణ పొందాలి. ప్రభువుకు మీ హృదయాలు సమర్పించుకొనాలి. పిల్లలను దేవుని యొద్దకు నడిపించాలి.

## మీ పిల్లలకు క్రమశిక్షణ నేర్పండి

తల్లిదండ్రులు పిల్లలను ప్రేమించాలి. వాక్యానుసారమైన క్రమశిక్షణ నేర్పాలి. లేకుంటే పిల్లలు పాడైపోతారు. పిల్లలు చిన్న చిన్న తప్పులు చేసినప్పుడు సమర్ధించకూడదు. వాటివలన కలిగే ప్రమాదాలను గురించి వివరించి వారికి చెప్పాలి. లేని యెడల పిల్లలు చెడిపోతారు, పాడైపోతారు. తల్లి, పిల్లలకు మంచిని నేర్పాలి. చెడుగు చేయకూడదని హెచ్చరించాలి. వాక్యము ద్వారా వారిని ఆదరించాలి. తల్లి ఆదరణ పిల్లలను కాపాడుతుంది. తల్లిదండ్రులు పిల్లలకు క్రమశిక్షణ నేర్పాలి. కొందరు తల్లిదండ్రులు పిల్లలకు క్రమశిక్షణ నేర్పరు. బూతులు తిడతారు, కొడతారు. శాపవచనాలు పలుకుతారు. హింసిస్తారు. పిల్లలకు కోపము రేపుతారు. పిల్లలు ఇల్లు విడిచి పారిపోతారు. ఎంత అవమానం. ఇది సైతాను పని. పిల్లలను తిడితే, కొడితే ప్రయోజనం శూన్యం. పిల్లలను గద్దించండి. కోపపడండి. హెచ్చరించండి. కాని పాపము చేయకండి. మంచి నేర్పండి. క్రమశిక్షణలో పెంచండి. వారి కొరకు అనుదినం ప్రార్ధించండి. వారిని ప్రతిదినం గమనిస్తూ వాక్యపు త్రోవలో నడిపించండి. తల్లిదండ్రులే పిల్లలకు మాదిరి.

## బాల స్పందన



పాస్టర్ పి.సురేశ్‌బాబు

# పాత రోత జీవితము

**కాగా ఎవడైనను క్రీస్తునందున్న యెడల వాడు నూతన సృష్టి. పాతవి గతించెను. ఇదిగో క్రొత్తవాయెను**

అది ఒక పెద్ద పట్టణం. రోడ్లన్నీ వాహనాలతో నిండి పోయాయి. వాహనాలు జోరుగా వెళ్ళిపోతున్నాయి. ఈ లోగా నాలుగు రోడ్ల కూడలిలోని ట్రాఫిక్ సిగ్నల్ రెడ్ సిగ్నల్ చూపడంతో స్టాప్‌లైన్ దగ్గర వాహనాలు నిలిచిపోయాయి. రెండు చేతులతోను పట్టుకొని ఉన్న వస్తువులను అమ్ముకోవడానికి రెడ్ సిగ్నల్ ఎప్పుడు పడుతుందా అని ఎదురు చూస్తొన్న కొందరు చిరు వ్యాపారుల వెంటనే వాహనాల దగ్గరుకు పరుగెత్తుకొని వచ్చి ఆ కొద్ది సమయంలోనే ఎంతమందికి చూపించి అమ్మగలరో అంతమందికి త్వరత్వరగా చూపిస్తూ వెళుతున్నారు. మరి కొంతమంది బిక్షగాళ్ళు బిక్షమడుగుతూ వారూ పోటి పడుతున్నారు. వీరి మధ్యలో మాసిన బనీను, నిక్కరు తొడుగుకున్న ఒక చిన్న పిల్లవాడు బిక్కు బిక్కుమంటూ వచ్చి తన చేతిలో ఉన్న ఒక చిన్న గుడ్డను తీసుకొని ఒక కారు దగ్గరకు వచ్చి వారి అనుమతి లేకుండానే వారి కారును తుడవడం మొదలు పెట్టి ఒక అరచేతిని దోసిటగా చేసి మరో చేతిని కారు తుడిచే గుడ్డతోనే తన పొట్టపైన వేసుకోని ఆకలి అవుతుంది ఏదైన సహాయము చేయమంటూ చెప్పకనే చెబుతూ కారులో ఉన్నవారి వైపు దీనంగా చూశాడు. వాడ్ని చూసి చీదరించుకుంటూ పొమ్మంటూ కారు లోపలనుండే సైగలు చేస్తున్నారు ఆ కారులో ఉన్నవారు. నిరాశగా మరో కారు దగ్గరకు నడిచాడు. వెనుకగా ఉన్న కారులో నుండి ఈ పిల్లవాడ్నే చూస్తొన్న డాక్టర్ గారికి జాలివేసింది వాడిపై. కారు అద్దం తీసి వాడ్ని రమ్మని పిలిచాడు. “మీ ఇల్లెక్కడా” అని అడిగాడు. “నాకు ఇల్లు లేదండి, ఇక్కడే ప్లాట్‌ఫామ్ మీద పడుకుంటాను” అంటూ జవాబిచ్చాడా పిల్లవాడు. “మరి మీ అమ్మా నాన్న ఎక్కడ?” అనగానే “ఎవరూ లేరని” బదులిచ్చాడు. డాక్టర్ గారికి వాడిమీద మరింత జాలి వేసింది. వాడ్ని తీసుకువెళ్ళి వాడికి క్రొత్త జీవితం ఇవ్వాలని నిశ్చయించుకొని “మరి నాతో వస్తావా! నేను నీకు చదువు చెప్పిస్తాను. మంచి భోజనం పెట్టిస్తాను, బట్టలు ఇస్తాను, నాతోనే మా ఇంట్లో చక్కగా ఉందువు గాని” అన్నాడు. డాక్టర్ గారి ఉద్దేశం ఏమిటో అర్థం చేసుకొనే వయస్సు వాడికి లేదు గాని ఆకలితో ఉన్న తనకు భోజనం అనగానే “వస్తానండీ” అన్నాడు. కారులో ఎక్కించుకొని ఇంటికి తీసకువచ్చాడు. ఇల్లు అంటే అది మామూలు ఇల్లు కాదు పెద్ద బంగాళా. ఆ పిల్లవాడు కారు దిగి ఆ బంగళాను చూడగానే గొప్ప ఆశ్చర్యం, కొంత బెరుకు, లోపల అర్థంకాకుండా ఉన్న సంతోషం. ఒక గంటలో వాడి రూపంతా ఆ ఇంటి పనివాళ్ళు మార్చేశారు. మంచి బట్టలు వేసుకొని



ఇప్పుడు చాలా శుభ్రంగా ఉన్నాడు. డాక్టర్ గారు "ఈ రోజునుండి ఈ పిల్లవాడు ఇక్కడే ఉంటాడు. వాడికేది కావాలన్నా ఇవ్వమంటూ" అందరికి చెప్పాడు. భోజనానికి డైనింగ్ టేబుల్ దగ్గరకు ఆ పిల్లవాడ్ని తీసుకొని వెళ్లాడు. అక్కడ రకరకాల కూరలు వండి ఉన్నాయి. ఇంకా చాలా రకాల వంటలు చేసి ఉన్నాయి. ఆపిల్, అరటి, బత్తాయి, ఇంకా బోలెడన్నీ పళ్ళు ఉన్నాయి. అన్ని తినేయాలని ఉంది కాని అన్నీ తినడానికి ఒక రోజు పడుతుందో రెండు రోజులు పడుతుందో! అయినా ఇవన్నీ పొట్టలో పట్టవేమో! అని మనస్సులో కొన్ని విచిత్ర ఆలోచనలు మరోవైపు ఇది కలకాదు కదా! అనే అనుమానం ఆ చిన్ని మనసులోకి వచ్చాయి. చక్కగా అన్ని వంటలూ రుచి చూస్తూ భోజనాన్ని తృప్తిగా తిన్నాడు. తరువాత డాక్టర్ గారు ఒక గదిలోనికి తీసుకొని వెళ్ళి "ఇది నీవు పడుకొనే గది. ఈ గదిలోని వస్తువులన్నీ నీవు వాడుకో. ఇంకా ఏమైనా కావాలంటే నన్ను అడుగు తీసుకువస్తాను. ఇకనుండి ఈ ఇల్లంతా మనది నీవు మాతోనే ఉంటావు. నిన్ను చదువుకోడానికి స్కూలుకు కూడా రెపటి నుండి పంపిస్తాను" అన్నాడు.

అసహ్యమైన పాప రొచ్చులో ఉన్న మనలను ఆ యేసయ్య రక్తముతో శుద్ధి చేసి మనలను పరిశుద్ధంగా చేశాడు. మురికి జీవితాలకు పరిశుద్ధ వస్త్రాలు ఇచ్చాడు. పరలోక విందు మనకొరకు సిద్ధపరుస్తున్నాడు. మన కొరకు ఆయన వద్ద నివాసాలు ఏర్పాటు చేస్తున్నాడు. అయిపోయింది అనుకుంటున్నారా! ఇంత గొప్ప రక్షణను నిర్లక్షము చేస్తే గనుక మనకంటే దురదృష్టవంతులు ఉంటారా!

డాక్టర్‌గారు మంచి స్కూల్‌లో ఆ పిల్లవాడ్ని చేర్పించి చదువు చెప్పిస్తున్నారు. కొన్నిరోజులైన తరువాత డాక్టర్ గారు రోడ్డు మీద వెళుతూ ఉండగా ట్రాఫిక్ సిగ్నల్ దగ్గర కారు ఆగింది. గత జ్ఞాపకాలు గుర్తుకు తెచ్చుకుంటుండగానే మరో పిల్లవాడు తన కారుకు చాలా ముందుగా కారు తుడుస్తూ పొట్ట చేత్తో పట్టుకొని అడుక్కుంటున్నాడు. కాదు కాదు తను ఇంటికి తీసుకు వెళ్ళిన పిల్లవాడిలాగానే ఉన్నాడు. డాక్టర్ గారు ఒకింత షాక్ కొట్టినట్టు ఉలిక్కిపడ్డాడు. ఒకే పోలికతో ఉన్నవాడా లేక వాడేవీడా! అని అయోమయంలో తేరుకునేలోపే ట్రాఫిక్ సిగ్నల్ గ్రీన్ పడడంతో అందురూ ముందుకు వెళుతున్నారు. తనూ ముందుకు సాగిపోక తప్పలేదు. ఆ పిల్లవాడు వెనక్కు వెళ్ళిపోయాడు. వెంటనే స్కూల్ కి ఫోన్ చేశాడు. స్కూల్‌కి ఈ మధ్య సరిగా రావడం లేదని వాళ్ళు బదులిచ్చారు. అర్థంకాని అయోమయంగా అయింది పరిస్థితి. సాయంత్రం ఇంటికి వెళ్ళాడు. స్కూల్‌నుండి వచ్చినట్టుగానే వచ్చాడు ఆ పిల్లవాడు. "స్కూల్‌కి వెళ్ళావా" అని అడిగిన డాక్టర్ గారికి "వెళ్ళాను" అంటూ బదులిచ్చి గదికి వెళ్ళిపోయాడు. డాక్టర్ గారు మరింకేమి అడగకుండా గజిబిజిగా చూస్తూ ఊరుకున్నారు. భోజనం సమయానికి ఆ పిల్లవాడు డైనింగ్ టేబుల్ దగ్గరకు రాలేదు. భోజనం తన గదిలోనికి తెప్పించుకున్నాడు. డాక్టర్ గారికి అర్థంగాక గది దగ్గరకు వెళ్ళి కిటికిలోనుండి చూసేసరికి నిర్ఘాంతపోయారు. ఆ పిల్లవాడు భోజనాన్ని నాలుగు భాగాలు చేసి గది నాలుగు మూలలా పెట్టి తన ప్లేటు తీసుకొని ప్రతి మూలకు వెళ్ళి "అమ్మ ఆకలేస్తుంది కొంచె అన్న ఉంటే పెట్టండమ్మ" అంటూ వాటిని తీసుకొని ప్లేటులో పెట్టుకొని గది మధ్యలో కూర్చోని తినడం మొదలుపెట్టాడు. వెంటనే డాక్టర్ గారికి అర్థమయ్యిందేమిటంటే వీడి పరిస్థితి మార్చినా, స్వభావం మాత్రం మారలేదు. ఇంత చక్కని వసతులు కల్పించినా వీడు ఇంకా పాత జీవితాన్నే ఇష్టపడుతున్నాడని అర్థమయ్యింది. వాడి స్కూల్ బ్యాగు చూస్తే వాడు ఇంతకు ముందు వేసుకున్న మురికి బనీను, నిక్కరు, పాత గుడ్డ వాసన కొడుతూ ఉన్నాయి. వెంటనే వాడ్ని తీసుకొని వెళ్ళి ఎక్కడనుండి తీసుకువచ్చాడో అక్కడే వదిలేసి వాడికి అర్థమయ్యేలా "నీవు ఇంతకు ముందులా ఉండాలంటే ఇక్కడే ఉండు. నేను చెప్పినట్టు ఉంటానంటే నాతోరా." అన్నాడు.

పిల్లలు చూశారా! మరి ఆ పిల్లవాడు ఏమి చేస్తే బాగుంటుందో మీరు చెప్పండి. కాదు కాదు ఏమి చేస్తే బాగుంటుందో అదే మనం కూడా దేవునిదగ్గర చేయాలి. దేవుడు చెప్పినట్టు వింటావా! మీ సండేస్కూల్‌లో మీరు ఏమి నేర్చుకుంటున్నారో అలాగే మాట్లాడాలి, పాడాలి, ఆడాలి, ప్రార్థించాలి, వాక్యాన్ని చదవాలి. అప్పుడే యేసయ్య "చిన్నపిల్లలను నా దగ్గరకు రానివ్వండి" అంటూ నిన్ను దగ్గరకు తీసుకుంటాడు.

దేవుని బిడ్డలమైన మనం ఆయనకు తగినట్లు జీవించకపోతే ఆయన రక్షణను నిర్లక్షము చేసినట్టే.



శ్రీమతి యన్. లిల్లీభాస్కర్

# సత్యమునకు స్తంభము

అపొస్తలుడైన పౌలు తన ఆత్మీయ కుమారుడైన తిమోతికి ఉత్తరం వ్రాస్తూ "***దేవుని మందిరములో అనగా జీవముగల దేవుని సంఘములో జనులేలాగు ప్రవర్తించవలెనో అది నీకు తెలియవలెనని యీ సంగతులను నీకు వ్రాయుచున్నాను. ఆ సంఘము సత్యమునకు స్తంభమును ఆధారమునై యున్నది.***" యేసుక్రీస్తును ప్రభువుగా అంగీకరించి ఆయన రక్తంలో తమ పాపములకు విడుదల నొంది ఆయన సత్యములో నడిచేవారందరు ఆయన సంఘములో ఉంటారు. దేవుని సత్యం అనే పునాది మీద కట్టబడినది ఈ సంఘం ఒక్కటే ఈ లోకంలో దేవుని సత్యానికిది పునాదికాగలదు. దేవుని సత్యం ఈ సంఘంద్వారా ప్రకటించబడాలి.

క్రీస్తు తన విశ్వాసులతో కట్టిన సంఘమే దేవుని కుటుంబము. కాబట్టి మీరిక మీదట పరజనులును పరదేశులునైయుండక పరిశుద్ధులతో ఏక పట్టణస్థులును దేవుని యింటివారునైయున్నారని అపొస్తలుడైన పౌలు ఎఫెసి (2:19) సంఘానికి తెలియజేస్తున్నాడు. గనుక అన్ని యితర కుటుంబాల్లోలాగే దేవుని కుటుంబములోని సభ్యులు ఎలా ప్రవర్తించాలో మొదట నేర్చుకోవాలి.

పౌలు ఈ లోక సంబంధమైన స్థానిక సంఘాలు, సంస్థలు గురించి మాట్లాడుట లేదు. వాటిలో కొన్ని స్తంభాలుఆ, బురుజులులా ఉన్నాయి గాని సత్యానికి మాత్రము కాదు. తప్పుడు ఉపదేశానికే అని తెలుసుకోవాలి. ఇక్కడ పౌలు ఉద్దేశం సంఘమంటే క్రీస్తు శరీరం, దేవుని ఆలయం, దానికి క్రీస్తే శిరస్సు, పునాది, మూలరాయి. (1 కొరింధి, ఎఫెసీ 1:22,23; 2:20-22; కొలస్సీ 1:18) క్రీస్తు తన కోసం కట్టుకొన్న సంఘమన్నమాట. క్రీస్తునందు విశ్వసముంచుట ద్వారా, దేవున ఆత్మ ద్వారా ఆధ్యాత్మిక జన్మపొందినవారే ఈ కుటుంబ(సంఘ) సభ్యులు కాగలరు. (యోహాను 3:3-8) ఆయన సత్యాన్ని అనుసరించినవారు పునాదిలా, స్తంభాలుగా మారతారు.

**యాకోబు నిలిపిన స్తంభము**

"నేను నీకు తోడైయుండి నీవు వెళ్ళు ప్రతిస్థలమందు నిన్ను కాపాడుచూ ఈ దేశమునకు నిన్ను మరలా రప్పించెదను. నేను నీతో చెప్పినది నెరవేర్చువరకు నిన్ను విడువనని చెప్పగా యాకోబు నిద్ర తెలిసి నిశ్చయముగా యెహోవా ఈ స్థలమందున్నాడు. అది నాకు తెలియకపోయేననుకొని భయపడి ఈ స్థలం ఎంతో భయంకరం. ఇది దేవుని మందిరమే కాని వేరొకటి కాదు. ఇది పరలోకపు గవిని అనుకొన్నాడు. తెల్లవారినపుడు యాకోబు లేచి తాను తలగడగా



చేసికొన్న రాయి తీసి దాన్ని స్తంభముగా నిలిపి దాని కొనమీద నూనె పోసెను." (ఆది 28:15-18)

ఇది జ్ఞాపకార్ధస్తంభము. పూజ చేయడానికి కాదు. దేవుని దర్శనము పొందిన యాకోబు దేవుడు ఆ స్థలమునందున్నాడని అది దేవుని ఆలయమేనని పరలోకపు ద్వారమని నమ్మి తను తలగడగా చేసికొన్న రాయిని స్తంభముగా నిలిపి ఆ రాయి పై నూనె పోసి ఆ స్థలాన్ని దేవునికి ప్రతిష్ఠించి యాకోబు దేవుని ఆరాధించు నట్లు చూస్తున్నాము. నిజ దేవుని ఆ విధముగా ప్రజలకు ప్రత్యక్షపరచెను.

## మేఘ స్తంభము

మోషే గుడారమును తీసి పాళెము వెలుపలికి వెళ్ళి పాళెమునకు దూరముగా దాన్ని వేసి దానికి ప్రత్యక్షపు గుడారమని పేరుపెట్టెను. (నిర్గమ 33:7-10)

ప్రతివాడు పాళెము వెలుపలనున్న ఆ ప్రత్యక్షపుగుడారమునకు వెళ్ళుచు వచ్చుచుండెను. మోషే ఆ గుడారములోనికి పోయినపుడు మేఘస్తంభము దిగి ఆ గుడారపు ద్వారమందు నిలువగా యెహోవా మోషేతో ముఖాముఖిగా మాట్లాడ చుండెను. ప్రజలందరును ఆ మేఘస్తంభము గుడారపు ద్వారమున నిలుచుట చూచి ప్రతివాడును నమస్కారము చేయుచుండిరి. అంటే ప్రత్యక్షపు గుడారము దేవుని మందిరముగాను ప్రజలు దేవుణ్ణి ఆరాధించుటకును దేవునితో మాట్లాడుటకును ఏర్పాటు చేయబడెను.

యెహోవా మోషేకు ఆజ్ఞాపించి నట్లు మోషే మందిరమును నిలువబెట్టి దాని దిమ్మలను వేసి దాని పలకలను నిలువబెట్టి దాని వెంటే బద్దలను చొనిపి దాని స్తంబములను నిలువబెట్టిరి. (నిర్గమ 40:18)

యెహోవా మోషేకు ఆజ్ఞాపించినట్టు దైవ నివాసానికి స్తంభాలను నిలువబెట్టాడు. స్తంభాలు లేకుండా నిర్మాణాలు చేయలేము.

నూతన నిబంధనలో "మీరు దేవుని ఆలయమైయున్నారనియు దేవుని ఆత్మ మీలో నివసించు చున్నాడనియు" 1 కొరింథి (3:16) సంఘానికి అపొస్తలుడైన పౌలు తెలిపాడు.

## ఆలయములోని స్తంభము

అంటే మానవుని దేహమే దేవుని మందిరము. అది దేవునికి దేవునికి ప్రత్యక్ష గుడారము వలే ఉండాలి. దేవుని కలిగిన ప్రతివ్యక్తి దేవునికి ఆలయముగా ఉన్నారని నిరూపించడానికే స్తంభముగా నిలిచి ఉండాలి. దేవుని యందు విశ్వాసముంచి ఆయనయందు నిజమైన భయభక్తులు కలిగి ఉంటే సంఘమునకు స్తంభముగా నిలిచినట్లే. దేవుని కృపను బట్టి "సామర్ధ్యము కలిగిన యాకోబు, యోహాను, పేతురు మూల స్తంభాలుగా ఎంచబడినట్లు" అపొస్తలుడైన పౌలు గలతి (2:9) సంఘానికి తెలియచేస్తే "జయించు వానిని నా దేవుని ఆలయంలో ఒక స్తంభముగా చేసెదనని" (ప్రకటన 3:12) యేసే తన శిష్యుడైన యోహాను ద్వారా తెలియజేసాడు. అంటే దేవుడు నిర్మిస్తున్న ఆధ్యాత్మిక ఆలయంలో ప్రతి నిజ విశ్వాసి ఒక భాగమైయున్నాడు. గనుక కుటుంబములో, లోకంలో శోధనలను ఎదుర్కోని నేత్రాశ, శరీరాశ, జీవపుడంబములను జయించి దేవునియందు నిజమైన భయభక్తులు, విశ్వాసము గలవారు స్తంభాలుగా నిలువగలరు.

## పునాది పైన స్తంభము

క్రీస్తు యేసు మూలరాయి యైయుండగా అపొస్తలులును, ప్రవక్తలును వేసిన పునాది మీద మీరు కట్టబడి యున్నారు. ప్రతి కట్టడమును అమర్చబడి ప్రభువు నందు పరిశుద్ధమైన దేవాలయమగుటకు వృద్ధిపొందుచున్నట్లు అపొస్తలుడైన పౌలు సంఘానికి వ్రాస్తున్నాడు. (ఎఫెసీ 2:20,21) మనము స్తంభముగా ఉండాలంటే తిన్నగా, స్థిరముగా, శక్తిగలిగి ఉండాలి.

**తిన్నగా ఉండాలి:** మనము సజీవమైన రాళ్ళవలె ఉండి ఆత్మసంబంధమైన మందిరముగా కట్టబడుచున్నాము. (1పేతురు 2:5; ఎఫెసీ 2:22)

**స్థిరముగా ఉండాలి:** "నీవు సజీవుడైన దేవుని కుమారుడవైన క్రీస్తువు" అని పేతురు యేసుతో అన్నపుడు యేసు "సీమోను బర్‌యోనా నీవు ధన్యుడవు.. ఈ బండమీద నా సంఘమును కట్టుదును. పాతాళద్వారములు దాని యెదుట నిలువ నేరవని" అన్నాడు.

**శక్తిని కలిగియుండాలి:** మన పాపభారాన్నంతటిని మోసిన మన ప్రభువు మన కొరకు బాదపడి తన అడుగుజాడల్లో నడుస్తూ (1పేతురు 2:21) ఆయన కాడి మోయుచు "యేసు శరీరమందు శ్రమపడెను గనుక మనమూ అట్టి మనస్సును ఆయుధముగా దరించుకొని (1పేతురు 4:1) ప్రభువు వలె ముందుకు సాగుదాము.

# MASTER’S COLLEGE OF THEOLOGY (MCT)

**(A Theological Institute of Vision Natives)**

***Affiliated to Senate of Serampore College (SSC)***



**(Batch of 2010-2011)**

**Master’s College of Theology (MCT), offers Theological Education under the ministry of *Vision Natives.* MCT trains nationals as Godly and Dynamic leaders to serve their nation. Medium of instruction is English. Courses begin in the third week of June every year. Dedicated men and women above 18 years may apply. Filled in applications are to reach by 15th May.**

**COURSES OFFERED**

| | | | |
|---|---|---|---|
| **Bachelor of Divinity (B.D.)** | **Serampore Degree** | **4 Years** | **Degree Passed from any Recognised University** |
| **Bachelor of Divinity (B.D.)** | **Serampore Degree** | **5 Years** | **XII / Inter Passed (OR) Equivalent** |
| **Certificate of Theology (C.TH)** | **College Diploma** | **2 Years** | **X Passed** |
| **Pre-Theology** | **College Certificate** | **1 Years** | **X Passed** |

For Application & Prospectus send Rs. 100/- M.O. or Demand Draft in favour of:

**Master’s College of Theology**

Plot No 5-7, Kommadi Road, Madhurawada, Visakhapatnam-530 041,
Andhra Pradesh, South India

Phone No : 0891- 2739803 & 2526342 e- mail : mctvizag@sify.com

# సొలొమోను - షేబ

(ఆధ్యాత్మిక నవల)

- ఆచార్య ఆరార్కే

*జరిగిన కథ* – సొలొమోను, అదోనియా వేటకు వస్తారు. గత జ్ఞాపకాలు (అమ్నోనును అబ్షాలోము చంపడం) సొలొమోను తలుస్తుండగా సింహం ఒకటి సొలొమోను ముందుకు వస్తుంది. అదోనియా హెచ్చరికతో వెంటనే బల్లెం విసిరి సొలొమోను దానిని చంపుతాడు. అదోనియా పనివాడు నెబాత్, సొలొమోను చనిపోయివుంటే నీవు రాజువవడానికి అడ్డం పోయేది కదా! అని అదోనియాకు చెబుతాడు. చాటుగా ఈ మాటలు విన్న సొలొమోను బాధపడతాడు. అప్పుడే దూరంగా ఒక అనుకోని సంఘటన.. ఇక చదవండి!

ఉన్నట్టుండి నెబాతు వులిక్కిపడి లేచాడు ''అదిగదిగో అటు చూడండి ఏదో పొగ లేచినట్టనిపిస్తోంది" యోవేలు సంభ్రమంతో లేచి నిలిచాడు.

అదోనియా కంగారు పడ్డాడు ''అటు పరుగెత్తండి ఏమిటది? అనుమానంగా వుంది."

"అది లహోరయిరోయి అనే గ్రామం. బెసోరు వాగు ఒడ్డున వున్న కుగ్రామం" అన్నాడు అక్కడే వున్న నెబాతు.

"అదెంత దూరంలో వుంది?" సాలోచనగా అడిగాడు అదోనియా

"ఓ గంట ప్రయాణం" ముక్తసరిగా జవాబు.

యోవేలు తటపటాయిస్తూ ''వారు సార్థవాహులు అరబ్బీ గుంపులు" అన్నాడు.

"బెయెర్షబానుండి సిక్లగు వరకు తిరుగుతూ దోపిడీలుచేసే ముఠాలు, ఓసారి వారు సిక్లగును దహనం చేసి నేలమట్టం చేశారు." అన్నాడు అక్కడే వున్న కాపరి వొకడు.

ఇంతలో బాలలు, స్త్రీలు అర్తనాదం చేస్తున్న సవ్వడి వినిపించింది. హాహాకారాలు మిన్ను ముట్టుతున్నాయి.

తన ఆయుధాలు మోసే సైనికుడిని అదోనియా పురమాయించాడు "నా విల్లు, అంబులపొది తీసుకురా!"

"అన్నా – నీవొక్కడివే ఆ గుంపును ఎదుర్కొంటావా?" సొలొమోను ప్రశ్న. అవునన్నట్లు అదోనియా తల పరికించాడు.

"మనం బెయెర్షాబాకు వెళ్ళి కొంతమందిని సమీకరించి తెస్తేనో?"

"తమ్ముడూ! మనం యిక్కడ ముప్పైమందిమి వున్నాము. మన తండ్రి దగ్గర ఎప్పుడూ, ముప్పైమందే యోధులుండేవారు జ్ఞాపకముందా? మృగరాజును చంపిన యోధుడివి. ఇంత బెంబేలు పడిపోతామిటి? పద, వారిని తరిమేద్దాం" అదోనియా పౌరుషం వుట్టిపడేలా హుంకరించాడు.

మరోనిమిషంలో అందరూ సన్నద్ధులై గుర్రాలను అధిరోహించారు.

సొలొమోను కూడా సిద్ధమై, గుర్రం ఎక్కబోతూ "నేనీ పోరాటములో చనిపోతానేమో? యెహోవా దేవుని సంకల్పమే గనుక నేను రాజు కావాలని వుంటే, విజేతనై బయట పడతాను. ఆయన సంకల్పానికి యిది నాకో పరీక్ష" అనుకొన్నాడు.

గుర్రం సకిలించి ముందుకాళ్ళు పైకెత్తింది. జబూద్ బల్లేలు



సొలొమోనుకు అందించాడు. వాయు మనో వేగాలతో ముప్ఫెయి గుర్రాలు ముందుకురికాయి. అదోనియా గురి చూచి బాణం విడిచాడు. అది దోపిడీ గుంపులో ఒక ఒంటెకు తగిలి అలాగే పడిపోయింది.

"యెహోవా నిస్సీ!" అంటూ పెద్దగా నినాదాన్ని వుద్ఘాటించాడు సొలొమోను. బల్లేల వర్షం కురిపించారు.

ప్రక్క నుంచి ఓ అరబ్బీ దోపిడీదారు సొలొమోన్ను ముట్టడించి అతడిని గుర్రం నుంచి పడద్రోశాడు. రెండే రెండు బల్లేలు మిగిలి వున్నాయి. నిరాయుధుడయ్యాడు. ఒరలో నుంచి కత్తి దూశాడు. ప్రత్యర్థిని ఒక్క పోటుపొడిశాడు. అతడు హాహాకారాలు చేస్తూ ఒరిగాడు.

జబూద్ ప్రక్కనే వున్నాడు. రక్తసిక్తమైన కత్తిని లాగాడు. తిరిగి యుద్ధ రంగంలోకి వురికాడు. దోపిడీ ముఠాలో వందల కొలది వున్నారు. అయితే గ్రామస్తులు, రాళ్ళు, రప్పలు, ఎవరిచేతి కందింది అందినట్లు దోపిడీ ముఠాపై విసరివేయసాగారు. ఈ ధాటికి తట్టుకోలేక అరబ్బీ ముఠాలు ఒంటెల్ను వెనక్కు మళ్ళించి పలాయనం చిత్తగించారు. మిగిలిన కొందరు హతులయ్యారు. కొందరిని అదోనియా, సొలొమోను ఖైదీలుగా పట్టుకొన్నారు. అయితే అందులో ఆరుగురు ఒంగలేదు. ప్రత్యక్ష యుద్ధానికి తలపడ్డారు. వీరు అరబ్బీయులు కారు.

"ఎవరు మీరు?" గంభీరంగా ప్రశ్నించాడు సొలొమోను.

"వారెవరైతే మనకేం తమ్ముడూ వారిప్పుడు మన శత్రువులు" అన్నాడు అదోనియా.

"అది కాదు అన్నయ్యా! వీరు షేబ దేశీయుల మంటున్నారు. అది సుగంధ ద్రవ్యాల దేశం. వీరు మోటు మనుషుల్లా వున్నారే!" ఆశ్చర్యం ప్రకటించాడు సొలొమోను.

"మేమెవరిమో నీకు బాగా తెలిసి వస్తుంది. పొండి లేదా మేము మీ అయిదుగుర్ని హతం చేసి గాని విడువం!" సవాలు చేశాడు నాయకుడు.

అదోనియా పకపకా నవ్వాడు. "యెహోవా నిస్సీ! ఈ ఈగ వుగ్రత నుంచి కాపాడు దేవా!'' అంటూ నర్మగర్భంగా వ్యాఖ్యానించాడు.

"అన్నాయ్, వారు మూర్ఖులే గాని, గొప్ప ధైర్యసాహసాలున్నాయి'' సొలొమోను ప్రశంస.

"ఏం - వేళాకోళమా? రండి, పోరాటానికి సిద్ధం. ఇద్దరిద్దరూ రండి. మా తడాఖా తెలుస్తుంది.'' తొడ చరిచాడు షేబీయుడు.

ఇంతలోనే అకస్మాత్తుగా ఓ బల్లెం గాలిలో ఎగిరినట్లు వచ్చి, షేబీయుడి నడుం మధ్యలో జానెడు లోతు దిగబడింది. "అబ్బా" అంటూ కిందకి ఒరిగాడు షేబీయుడు. అదోనియా దనుష్టంకారం చేశాడు. "రండి కాకి ఈకెల్లాగా ఎగిరిపోదలుచుకున్న వారు ముందుకు వచ్చి నిలవండి చెప్తా" గర్జించాడు. మిగతా అయిదుగురు ఒక్క పెట్టున ఆయుధాలు కింద పడేసి లొంగిపొయ్యారు.

పడిపోయిన నాయకుడినీ సొలొమోను సమీపించాడు. అతడు కొన ప్రాణంతో వున్నాడు. అతడి శిరస్త్రాణం లాగేశాడు సొలొమోను.

అతడు యువకుడు. సొలొమోనుకు సమవయస్కుడు. జబూద్ సగర్వంగా శత్రు ఖైదీ వైపు వంగి చూచాడు. తన బల్లెమే వీణ్ణి పడేసింది! సొలొమోను సైగ చేశాడు. అతడిని చెట్టు కిందికి నీడలోకి మోసుకెళ్ళారు.

శరీరం మీద రక్తపు డాగులుంటే వెళ్ళి స్నానంచేసి వచ్చాడు సొలొమోను. షేబ యువకుడి ముఖం చల్లటి నీటితో కడిగాడు. మెల్లిగా కళ్ళు తెరిచి, అతి ప్రయత్నం మీద మోచేతి మీదిగా లేచాడు.

''నేనింకా బతికే వున్నానా? చనిపోయి వుంటే వీరోచితంగా వుండేది".

సిగ్గేమీ పడకు నేస్తం! బతికి వుండడం మంచిదే" అనునయించాడు సొలొమోను.

కళ్ళు పెద్దవిచేసి, చూస్తూ "ఆ! నీవా! అది సరే మా వాళ్ళేరి? వీరోచితంగా వారంతా మరణించారా?" అడిగాడు ఉద్రేకంగా.

''వారంతా బతికే వున్నారు. క్షేమంగా వున్నారు'' సొలొమోను నెంపాదిగా చెప్పాడు.

"హూ! పిరికి సేవకులు. అబ్బా. తల బాధ. నేను చనిపోయినా బావుండేది'' అంటూ నేలమీద కొరిగాడు షేబీయుడు.

''నేస్తం! లే - బతకడం భారమనిపిస్తోందా? ఇదిగో ద్రాక్షారసం - తాగు - మరోసారి వీరోచితంగా

పోరాడవచ్చులే!" అన్నాడు సొలొమోను.

జబూద్‌కు సొలొమోను సైగ చేశాడు. జబూద్ వచ్చి, షేబీయుడి చెయ్యి వీపు క్రింద పెట్టి లేవనెత్తాడు. "నీ పేరేమిటి?" అడిగాడు సొలొమోను.

"నా పేరు సిత్తార్, నా తండ్రి పేరు మెరిసామిస్. నా చెల్లెలి పేరు బల్కీస్. ఆమె షేబ దేశపు రాణి."

నా కిప్పుడు తల కొట్టినట్లయింది. ఓ ఇశ్రాయేలు కావరి చేతిలో ఖైదీనయ్యాను బాబోయ్! అంటూ ముఖం కప్పుకొని ఏడ్చాడు. "కంగారు పడకు నేస్తం, నేను సొలొమోనును, దావీదు మహారాజు కుమారుడిని. దావీదు మహారాజు ఇశ్రాయేలు యూదా దేశాలకు పరిపాలకుడు".

"ఆ, దావీదు మహారాజు కుమారుడివా? అయితే కాస్త ద్రాక్షారసం అందించు" అన్నాడు. గిన్నెడు ద్రాక్షారసం గటగట త్రాగేశాడు.

సొలొమోను అడిగాడు. "షేబ దేశం దక్షిణానికి ఎన్ని రోజుల ప్రయాణం! నువ్వెలా యింత దూరం వచ్చావు? దోపిడీ దొంగల ముఠాతో ఎందుకొచ్చావు? షేబ దేశపు రాణి సోదరుడివి, రాచఠీవితో సమాధాన పూర్వకంగా రావాలి. లేదా యుద్ధంలో సేనాపతిగానైనా రావాలి."

"నా సోదరి కూడా మీరన్నట్లే అంటుందనుకుంటాను"

"లేదు. మేము ఈజిప్టుకు వచ్చాము. ఫరో స్నేహితుడు హదదు. అతడు ఎదోమీయుడు. హదదుకు ఫరో "సుసెన్నస్" - తన మరదల్నిచ్చాడు. ఈ పెళ్ళికి మేము వచ్చాము. పెండ్లి అయిపోయాక, హదదు మాటల సందర్భంలో ఇశ్రాయేలు జాతిని గురించి ప్రస్తావించాడు. హదదు మీ గురించి నీచాతినీచంగా వర్ణించాడు.

యోవాబు అనే మీ సేనాపతిని శాపనార్ధాలు పెట్టాడు. ఎదోము జాతికి మీరు తీరని కీడు చేశారన్నాడు. ఆ

*(మిగతా వచ్చే సంచికలో)*

కవితా స్పందన

## నేలపాలు

**– ఆచార్య కృపాచారి గుజ్జర్లమూడి**

పిడికిలి పట్టలేనిది మనిషి ఆయువు
ఒడిలో వేయలేనిది మనిషి జీవితం

ఎంత పరుగిడినా
అలసట లేదంటూ

వెనుదిరిగి చూస్తే జీవితం ఎంత
వేగంగా గడిచింది మంచు ఆవిరైనట్లు

నా గమ్యం ఏది?
గమనం ఏది?
అనే ప్రశ్నలకు
గగనం కన్పిస్తుంది

ఒక్కసారయినా నా యేసుతో
నడిచిన పూలబాట ఏది?
ఆయన మాట విని
తృప్తిచెందిన క్షణాలు
లెక్కిచడానికి?

జీవితం ఎంతాలా
నేలపాలు చేశాను!


## వధువు కోసం

**క్షత్రియరాజుల కుటుంబంలోనుండి రక్షణ మారుమనసు అనుభవం కలిగి విశ్వాసుల కుటుంబాలకు చెందిన కడప, యువకునికి వధువు కావలెను. 28 సం॥ వయసు, 5'10" ఎత్తు. యం. యస్సీ చదివి బెంగుళూరులోని ఓ మంచి కంపెనీలో నెలకు 35వేల జీతం గల యువకునికి డిగ్రీ లేదా పి.జి చేసిన వధువు కావలెను.**

**అలాగే ఇదే కుటుంబానికి చెంది యం. బి. ఏ చేసి చెన్నయ్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా నెలకు 45 వేల జీతం, 26 సం॥ వయసు, 5'.7" ఎత్తు ఉన్న వరునికి బి. టెక్ గాని యం. టెక్ గాని చేసిన వధువు కావలెను.**

**సంప్రదించవలసిన ఫోన్ – 94904 83525**


## జనవరి గ.ను.క జవాబులు

**అడ్డం ■**

1.న్యాయపీఠము 4.దేవుని 6.హవ్వ 7.నుదుట 9.వర్షము 10.దాగోను 12.జీవాధిపతి 14.పలికిన 16.కాదేషు 17.బలి 19.గిన్నె 21.ప్రవర్తన 24.వడ్డీ 25.మెరుపులు

**నిలువు ■**

1.న్యాయాధిపతి 2.వీషోను 3.ముచ్చట 4.దేహమును 5.నిర్జీవక్రియ 8.దున్నువారు 11.గోతికి 13.పరదేశు 14.నలిగిన 15.పనుల 18.దేవత 20.జీవ 22.పైరు 23.పాలు

# క్షుప్త ప్రసంగాలు

## సిద్ధపడుట (మత్తయి 25:1-14)

1. ఆయన చిత్తనుసారముగా చేయుటకు సిద్ధపడాలి. ఎజ్రా 10:11.
2. ఆయన సన్నిధిని నిలుచుటకు సిద్ధపడాలి. నిర్గమ 34:2.
3. పరిశుద్ధులకు పరిచర్యచేయుటకు సిద్ధపడాలి. 2 కొరింథీ 8,9 అధ్యా,
4. ఆయన కొరకు ప్రాణం పెట్టుటకు సిద్ధపడాలి. ఫిలిప్పీ 2:29,30.
5. మనము సిద్ధపడి అనేకులను సిద్ధపరచాలి. యెహె 38:7.
6. సమాధానం చెప్పుటకు సిద్ధపడాలి. 1పేతురు 3:15,16.
7. మనము ఆయన దినము కొరకు సిద్ధపడాలి. మత్తయి 24:44.

## నీవు పొందిన కృప

(యోహా 1:17; 2 కొరింథీ 8:1)

1. కృపను మనము వ్యర్థం చేసికొనకూడదు. 2కొరింథీ 6:1.
2. ఆయన కృప నిష్ఫలం కాకుడదు. 1కొరింథీ 15:10.
3. ఆయన కృప నుండి మనము తొలగిపోకూడదు. గలతీ 5:4.
4. ఆయన కృపను తిరస్కరించకూడదు. హెబ్రీ 10:29.
5. ఆయన కృపను విసర్జించకూడదు. యోనా 2:8.
6. ఆయన కృపలో తప్పిపోకూడదు. హెబ్రీ 12:15.
7. నీవు ఆయన కృపకు దూరమైపోకూడదు. 2 సమూ 7:15.

## యెహోవాయందు నమ్మిక యుంచువారు

1. ఆయనయందు నమ్మికయుంచువారు సురక్షితముగా వుందురు. సామె 29:25.
2. ఆయనయందు నమ్మికయుంచువారు వర్ధిల్లును. సామె 28:25.
3. యెహోవాయందు నమ్మికయుంచిన వారి మొఱ్ఱ ఆయన ఆలకించును. 1 దిన 5:20.
4. కదలక నిత్యము నిలుచు సీయోను కొండవలే నుందురు. కీర్తనలు 125: 1.
5. ఆయనయందు నమ్మికయుంచువానికి రక్షణ కలుగును. కీర్తనలు 62:1,8.
6. యెహోవాయందు నమ్మికయుంచు వాని త్రోవలు ఆయన సరాళము చేయును. సామె 3:5,6.
7. యెహోవాయందు నమ్మికయుంచువాడు సిగ్గుపడడు. కీర్తనలు 25:2.

## మనము పిలువబడినది

1. మనము పిలువబడినది పరిశుద్ధులుగా వుండుటకు. 1థెస్స 4:7.
2. మనము యేసుక్రీస్తువారుగా వుండుటకు పిలువబడితిమి. రోమా 1:7.
3. మనము యేసుక్రీస్తు మహిమ పొందుటకు పిలువబడితిమి. 2థెస్స 2:14.
4. మనము ఆయన గుణాతిశయములను ప్రచురపరచుటకు 1పేతురు2:9.
5. మనము సమాధానముగా వుండుటకు పిలువబడితిమి. 1 కొరింథీ 7:15.
6. నిత్య జీవము పొందుటకు మనము పిలువబడితిమి. 1తిమోతి 6:12.
7. దేవుని ఆశీర్వాదము పొందుటకు పిలువబడితిమి. 1పేతురు 3:9.

‘ఓస్వాల్డ్ ఛాంబర్స్’ గారి ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన

**MY UTMOST FOR HIS HIGHEST**

**ఆయన ఘనత కోసం నా సర్వస్వం**

అనే శ్రేష్ఠగ్రంథం ఇప్పుడు మన తెలుగు భాషలో లభ్యం!

హిందీ, కన్నడం, మలయాళం, తమిళ భాషల్లో ఇప్పటికే అందుబాటులో ఉంది.

ఇప్పటికే నలభై భాషల్లోనికి అనువదించబడిన ఏకైక గ్రంథం.




ఆధునీకరించబడిన ఆంగ్ల ప్రతితో బాటు మరికొన్ని భారతీయ భాషల్లో కూడా త్వరలో లభ్యం.
అత్యంత ప్రజాదరణ పొందిన మరియు అత్యంత ప్రియమైన అనుదిన ధ్యానమాలిక!!
ఆధ్యాత్మిక జీవితంలో నిమగ్నమైన భక్తునికి, దేవజ్ఞాన విధ్యార్థికి ప్రామాణికమైన ధ్యానమాలిక!
ధ్యాననిమగ్నుడైన క్రైస్తవునికి, వేదాంత విద్యార్థికి ప్రామాణికమైన అనుదిన ధ్యానమాలిక!
గంభీరభావం మరియు క్లుప్తత ఈ ధ్యానమాలిక ప్రత్యేకత!

వెల.₹ 100

**చూడండి! ఆస్వాదించండి!** **ప్రతిని స్వంతం చేసుకోండి!**

ప్రచురణకర్త

**ఇండియన్ ఇవాంజెలికల్ మిషన్, బెంగళూరు**

080-22245256, 22480080

E-mail: generalsecretary@iemoutreach.org

గౌరవ సలహాదారులు:

**జాన్ టెన్ టెన్**

09745049846,

E-mail: yohankjohn@gmail.com

ప్రతులు కావాల్సినవారు **స్పందన, ఇ.ఎస్.ఐ హాస్పటల్ రోడ్,**
**గుణదల, విజయవాడ - 520 004 ఫోన్ 9490113300**


## జనవరి గ.ను.క ఆల్ కరెక్టు వ్రాసినవారి పేర్లు

జి.శారాసుగుణ-జమ్మలమడుగు, యస్.జమీమా-ఒంగోలు, ఆర్.యమ్.విజయకుమారి-మదనపల్లి, యమ్.నిర్మాలాసుదీప్‌రెడ్డి-కొండపల్లి, ఎ.జయమ్మ-అనంతపురం, యమ్.దేవకృప-హన్మకొండ, యన్.సత్యనారాయణ-విశాఖపట్నం, పి.నయోమి-బెంగుళూరు, ఎ.శారాప్రభావతి-గుంతకల్, యమ్.మనితాప్రభాకర్-నంద్యాల, సి.హెచ్.కస్తూరాభాయి-చీరాల, జి.రిబ్కమ్మ-కలసపాడు, పి.హిల్దామార్గరెట్-నెల్లూరు, టి.శోభారాణి-హన్మకొండ, వి.జడ్సన్-అమీనాపురం, ఆర్.రాజమణి-తాడేరు, వై.పి.మేరీప్రమీల-హిందూపూర్, యం.ఝాన్సి-హన్మకొండ, యస్.యఫ్.కస్తూరిభాయి-మదనపల్లి, జె.సరోజిని-రాజమండ్రి, కె.జె.మార్గరెట్‌పద్మాకర్-గుత్తి, కె.శెశీల్య-కంచికచర్ల, వి.మేరీస్వర్ణలత-కడప, ఎస్తేరువిజయప్రసాద్-అనంతపురం, బి.కెంపురత్నకుమారి-వరంగల్, కె.కనకమ్మ-హన్మకొండ, హెచ్.ఫ్లోరెన్సమ్మ-చిన్నదొర్నాల, మార్తాయేసుదాస్-జమ్మలమడుగు, కె.గ్లోరి-గుంటూరు, బి.అనీమేరి-హైదరాబాదు, జె.స్యామినాదన్-కుప్పం, జె.రాజశ్రీచంద్రమణి-కుప్పం, జె.సౌందర్యకళ-పలమనేరు, షీబాభాస్కర్-హిందూపూర్, భారతీదేవప్రియం-కడప, యస్.కమలమ్మ-ఒంగోలు, కె.విమల-హైదరబాదు, డి.సుందరరాజన్-కుప్పం, బి.ఫ్లోరెన్స్ చార్లెస్-కరీంనగర్, హెచ్.సరళమ్మ-గిద్దలూరు, పి.యస్.భాగ్యవతమ్మ-గిద్దలూరు, ఎ.నవమ్మ-పొదిలి, జి.పద్మరాజు-కాకినాడ, బి.సుగుణమ్మ-కాకినాడ, జి.పాల్-కలసపాడు, జె.శ్యామల-గుంటూరు, వి.యల్.ప్రసూనాంబ-గుంటుపల్లి, బి.శాంతకుమారి-కడప, వై.ఎస్తేరమ్మ-కంచికచర్ల, వై.మాణిక్యం-కంచికచర్ల, యు.యస్.పురుషోత్తం-ప్రొద్దుటూరు, సి.రాణిప్రమీల-కర్నూలు, సంపతీపీటర్-పరకాల, ఎ.అరుణాఎల్సఫాన్-కనిగిరి, ఎ.మునిరాజు-కడప, బి.చంద్రలీల-మదనపల్లి, డి.డి.డి.ఎ.మణి-విశాకపట్నం, బి.యన్.హేమలతపాల్-మదనపల్లి, జేన్ఆనంద్-డోన్, కె.విజయ-తెనాలి, వి.యమ్.ప్రభావతి-హైదరాబాదు, మైత్రిమాధుర్య-విశాఖపట్నం, యమ్.స్వర్ణలతఏంజల్-కర్నూలు, కె.స్తోత్రవాణి-చీరాల, రమణమ్మసోమయ్య-అనంతపురం, విమలప్రభావతి-బద్వేల్, జి.యస్.సునీతారావు-బద్వేల్, యం.సి.మనోహరమ్మ-అనంతపురం, బి.ఏలీషారావు-గుడివాడ, జి.కె.ఎల్.సుగుణమ్మ-బద్వేల్, దీనమ్మ.టి క్రిష్టోఫర్-హన్మకొండ, యస్.ప్రమీలారాజన్-జమ్ము, యస్.రూతుఆమేసు-కనిగిరి, బి.ఆశీర్వాదం-పిఠాపురం.

ఒకతప్పుతో వ్రాసినవారు: పి.దేవదానం-నంద్యాల, కె.కృపానందం-చెన్నై, కె.విమల-కొత్తవలస, జయమ్మలాబాను-గుంతకల్, టి.శాంతరత్నం-ఏలూరు, జె.జి.సుదరం-గొట్టిప్రోలు, యన్.బి.ప్రభావతి-బేస్తవారిపేట, బి.కృపానందము-నర్సాపురం, ప్రసన్నలక్ష్మి-గిద్దలూరు.

# ప్రార్థన వేదిక



1. వై.రాజారత్నం - గుజరాత్
భార్య కాలు (విరిగింది) స్వస్థత కోసం
2. యస్.పి.జ్యోతి - మచిలీపట్నం
శ్రీకాంత్ చదువు, శైలజ వివాహము కోసం
3. టి.యమ్.ఆల్‌ఫ్రెడ్ - అనంతపూర్
ఆలయము నిర్మణము పని కోసం
4. పి.దీపక్‌ముఖర్జీ - కడప
బి.ఫార్మసీ సీటు కడపలో దొరుకుట కోసం
5. డి.సత్యరెడ్డి - మచిలీపట్నం
శ్రీహవీల ప్రదీప్ ఉద్యోగబద్రత, ఆధ్యాత్మికత కోసం
6. డి.రూతమ్మ - తాళ్ళూరు
కుమార్తె వివాహం కోసం
7. ఆర్.రాజామోహన్ రావు - వరంగల్
భార్య, కుమారుడు, ఆరోగ్యం కోసం
8. యమ్.అరుణదేవి - రాజమండ్రి
పిల్లల చదువు, భర్త ఆరోగ్యం కోసం
9. కె.ఉషారాణి - కాకినాడ
కమల 'సయటికా' వ్యాది స్వస్థత కోసం
10. బి.మీనాక్షి - గుంటూరు
ఆరోగ్యము, సేవ కోసం
11. పి.మేరీ స్నేహలత - గుంటూరు
ఫిట్స్ వ్యాదినుండి స్వస్థత కోసం
12. జె.సరోజిని - రాజమండ్రి
కుటుంబములో శాంతి సమాధానములు కోసం
13. బి.కె.స్వామి - గుంటూరు
ఆనంద్ కుటుంబం రక్షణ కోసం
14. జి.దేవిడ్‌రాజు - అనంతపల్లి
పాప స్వస్థత కోసం
15. ఎ.నాగరాజు లక్ష్మి - తాడేపల్లి గూడెం
పిల్లల ఆరోగ్యం, దేవునిలో ఎదుగుదల కోసం
16. సునీత - విశాఖపట్నం
సుదీప్ చదువు కోసం
17. యమ్.ఆశీర్వాదమ్మ - గూడురు
కుమార్తె సౌదామిని భవిష్యత్తు కోసం
18. కె.రామ్మోహనరావు - చీరాల
బలహీనతనుండ స్వస్థత కోసం
19. పి.రవికుమార్ - నిడదవోలు
గర్బఫలం, అన్నదమ్ములు, తల్లిదండ్రుల కోసం
20. పి.యస్.ఆర్.ఆంజనేయులు - పెదపూడి
మనమడు చదువు కోసం
21. వి.జీవరత్నం - నిడదవోలు
శాంతికుమారి, జీవరత్నం గార్ల ఆరోగ్యం కోసం
22. జి.సుదర్శనం - పిఠాపురం
ఆరోగ్యం సరిగాలేదు స్వస్థత కోసం
23. ఆర్.సరోజని - రాజోలు
పిల్లలకు మంచి ఉద్యోగాల కోసం
24. జి.యమ్.జోసఫ్ - కర్నూలు
కుమారులు, కుమార్తెలు, కుటుంబం కోసం
25. బి.ఆనంద్‌కుమార్ - హుబ్లీ
వినోద్‌కుమార్ ఉద్యోగము కోసం
26. బి.దేవిడ్ - వెలుగోడు
కిరణ్, సుచరితల గర్భఫలము కోసం
27. యమ్.రూతువర్ధినా - కాకినాడ
పిల్లల చదువు,రక్షణ,భవిష్యత్తు, భర్త ఆరోగ్యం కోసం
28. సి.హెచ్.దావీదు - భట్టిప్రోలు
పెదబాబు ఉద్యోగం, చినబాబు,పాప చదువు కోసం
29. పి.జి.అభిషేకం - బెల్లంపల్లి
అమ్మాయి వివాహం, కుమారుల చదువు కోసం
30. బి.సుబ్బారావు - ఏలేశ్వరం
భార్య ఆరోగ్యం కోసం

## మెదడుకు మేత

# నిర్గమ కాండములోని ఇశ్రాయేలీయుల పనులు

కూర్పు – పాస్టర్ పి.ప్రతాప్ కుమార్

దే

రా క ని

వి ఇ న్ని శ రా స

మై త్రి మె టు మ కు మా

ల ల దా ది సే క ఈ న పి

వీ కొ స సు మై గ ల తో గాం డ్రి

దే ర వై త్వ ము లు పే చే ము గా ద్రు శ

గా యు క్త నై ము మో లు జ్ఞ త్ర మం ద్దు ము చై

ర మి మ దై కొ రో మ డ్లు తం లు రు ద్దు ద గో

క వా డ గు శా వ ఫ లం గం దె క్కు మె న ది ము తో

నీ రు త ను మా ది శ ర డ లో పొ గ లు లే ర గా

ఏ షి మ లు ప్ప క మీ లో క్తి వ జై జీ చే ర్పు నే కా దు రా

ఏ మం ఫ్రా తీ యి ను రో హ అ ము కో ప జీ తీ వ్య ధ తో ము

పా త్ర లు కా య్యా కొ న్ని లో ది ర్ప మీ లు నే యా పూ డి ఢాం లో ర్యా జా

ము రి నీ ము ష శే పి పం స గా రం లో ల్ల లూ ని య గా లో మి డి

క్రో ద్ర గా లు క టి క చీ క టి క్త య్యు పి మం ర గా మం వే గా డి

పా వి ము స్త్రీ ర స మం పూ ప్రాటా గా వి ట్లె ప మ త్ర ము ర ధ క

ష గా తె స పో కూ డ ట దు ష క్ష ర్యా గొ డ సా మై నం త లో ని

లు గు ద్దు ఎ ళ్ల క దు తీ గ ర్పు వీ ము గా ను రు తూ ర్పు గా లి వి

ళ్ళు వ ద్ద ని ఎ ఎ రె చే ర జి గే మ లు పూ రు తో ను న కి ది

1. రామసేసు
2. ఇటుకల
3. దాసత్వము
4. శకునగాండ్రు
5. మంత్రజ్ఞులు
6. రక్తమగును
7. ఈగలు
8. దైవశక్తి
9. ఫరో
10. దద్దురులు
11. మంత్రసానులు
12. శేషము
13. వడగండ్లు
14. పొక్కులు
15. మిడతలు
16. గాఢాంధకారము
17. కప్పలు
18. పేలు
19. చేపలు
20. అహరోను
21. షిఫ్రా
22. పూయా
23. జిగటమంటి
24. కటాక్షము
25. మిర్యాము
26. తీర్పులు
27. కొయ్యకాలు
28. సర్పము
29. తమమంత్రము
30. తెగుళ్ళు
31. ఎఱ్ఱసముద్రము
32. తూర్పుగాలి
33. చేదుకూరలు
34. గొట్టెపిల్ల
35. కటికచీకటి

**సూచనలు:**

**ప్రత్యేక గమనిక –** అనివార్య కారణాల వల్ల ఫిబ్రవరి సంచిక పంపటం ఆలస్యమయింది. అంచేత గ.ను.క మార్చి 10 తేది వరకూ పంపవచ్చు. 1వ తేది పోస్టు చేసే మార్చి సంచికలో వేసే ఫిబ్రవరి సమాధానాలు కాని, కరెక్టురాసిన వారి పేర్లు ఏప్రిల్ సంచిలో ప్రచురిస్తాము.

– స్పందనలో ప్రింట్ చేసిన గ.ను.క. లోనే పంపాలి. వేరుగా పంపినవి స్వీకరింపబడవు.

పూర్తి చేసి పంపిన వారి పేరు.........................

స్పందన కోడ్ నంబరు ..............................

(ఆధారాలు –50 కీర్తన నుండి 100 కీర్తన వరకు)

## ఫిబ్రవరి గళ్ళ నుడి కట్టు

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | | ⊗ | 2 | | | ⊗ | 3 | 4 | |
| | ⊗ | ⊗ | | ⊗ | ⊗ | ⊗ | | | ⊗ |
| 5 | | 6 | | ⊗ | 7 | | | | ⊗ |
| | ⊗ | | ⊗ | 8 | | | 9 | 10 | 11 |
| ⊗ | 12 | | ⊗ | | ⊗ | ⊗ | 13 | | |
| 14 | | | 15 | 16 | | | | | ⊗ |
| | | ⊗ | ⊗ | | ⊗ | 17 | ⊗ | ⊗ | 18 |
| | ⊗ | ⊗ | 19 | ⊗ | 20 | | | 21 | |
| ⊗ | 22 | ⊗ | | 23 | | | ⊗ | ⊗ | ⊗ |
| 24 | | ⊗ | | ⊗ | 25 | | | | |

## అడ్డం

1. నీ – – తోను, నీ ప్రభావములోను దినమంతయు నానోరు నిండియున్నది.
2. దైవ – – – లో యెహోవా వంటి వాడెవడు?
3. మకరము యొక్క – – – ను నీవు ముక్కలుగా గొట్టితివి.
5. – – – – ఏండ్ల కాలము ఆ తరము వారివలన నేను విసికి....
7. యుగయుగములు నేను నీ – – – – లో నివసించెదను.
8. – – – – తో సంతోషగానము చేయుడి. కీర్తనలు పాడుడి
13. – – – గల మనస్సు కలుగజేసి నన్ను దృఢపరచుము.
14. నీ – – – మేఘ మండలము వరకు వ్యాపించియున్నది.
15. – – నన్ను రక్షించుటకు త్వరపడి రమ్ము.
16. స్వరమండల – – – తో నిన్ను స్తుతించెదను.
20. మన – – – దుర్గమును బట్టి సంతోషగానము చేయుదము.
21. భూమి మీద నున్న భక్తిహీనులందరు – – తో కూడ దానిని పూర్తి మింగివేయవలెను.
23. నీ – – – నాకు చాటు చేయుట యేల?
24. మరణమందు వారికి యాతనలు లేవు. వారు – – గా నున్నారు.
25. – – – – – తానే దాని స్థిరపరచెననియు సీయోను గూర్చి చెప్పుకొందురు.

## నిలువు

1. అప్పుడే నా నోట శ్రేష్ఠమైన – – – యుండెను.
2. ఆయన పట్టణపు – – – పరిశుద్ధ పర్వతముల మీద వేయబడినది.
3. భూమ్యాగాధ స్థలములు ఆయన చేతిలో న్నుది. పర్వత – – – – లు ఆయనవే.
4. భక్తిహీనుల – – – లో వారు తమ పాదములను కడుగుకొందురు.
5. వారు కరిగిపోయిన – – వలె నుందురు.
6. – – – లు తమ అలలను హోరెత్తునట్లు చేయుచున్నవి.
8. శుభకరమైన – – – – నాకు కనుపరచుము.
9. వారు – – – తనమందు ఇంకా చిగురు పెట్టుచుందురు.
10. నా తట్టు మరలి నాకు – – – కలుగజేయుము.
11. అతని విరోధుల కుడి – – ని హెచ్చించి యున్నావు.
12. నేనైతే – – – ఆయన స్తుతిని ప్రచురము చేయుదును.
14. భూమి వణికెను దేవుని – – – ని అంతరిక్షము దిగజారెను.
17. వన – – – లన్నియు ఉత్సాహధ్వని చేయును గాక.
18. భక్తిహీనులు – – వలె చిగుర్చుదురు.
19. నీ – – – అగ్నివలె ఎల్లప్పుడు మండునా?
22. అన్యజనుల మీద ఆయన తన – – యుంచియున్నాడు.

# ప్రభువును అంగీకరించిన బ్రాహ్మణుల మధ్యన ఉత్తమ సేవ

పాస్టర్ మణిబాబు గారు ఓ బ్రాహ్మణ కుటుంబం నుండి రక్షింపబడ్డారు. దేవుని సేవా పిలుపునందుకుని సేవలో కొనసాగుతున్నారు. ఆ మధ్యకాలంలో నెల్లూరులో వారు నిర్వహించిన సభలకు దైవజనులు ఆరార్కే గారిని, నన్నూ దైవసందేశకులుగా ఆహ్వానించారు. అఫ్‌కోర్స్, దేవసహాయం గారూ మీరు బ్రాహ్మణులా? అంటే 'యేసయ్యను నమ్ముకున్న వారంతా సూపర్ బ్రాహ్మణులు' అంటారు ఆరార్కే గారంటూ  జవాబిచ్చాను!!!!

సరే, ఇక్కడ కులాల ప్రస్తావన చేయటం నా ఉద్దేశ్యం కాదు గాని, బ్రాహ్మణ్యంలోనుండి రక్షింపబడినవారి పరిస్థితి వేరు. ప్రత్యేకించి సనాతన సాంప్రదాయాలనుండి వచ్చిన వారిని "అంటరాని వారి మతంలో, అమెరికా  వాళ్ల మతంలో చేరిపోయాడంటూ బంధువులు, స్నేహితులంతా వెలివేస్తారు. అలాగే క్రైస్తవ సంఘాల్లో కూడా వారితో కలిసిపోయే పరిస్థితులు కూడా అంతంత మాత్రంగానే ఉంటాయి. సనాతనబ్రాహ్మణ కుటుంబాలలో నుండి ప్రభువును అంగీకరించిన వారు ఎదుర్కొనే గడ్డు సమస్యలు చాలా ఉంటాయని, అలాంటి కుటుంబాల్లోనుండి వచ్చిన  పిల్లలు కూడా అటు సాంప్రదాయక విషయాలలో పెరిగి బంధువులందరినీ దూరం చేసుకుని, అయోమయ భావన ఏర్పడుతుందని, దేవుని కృప వారికి మరెక్కువగా ఉండాలని, ప్రార్థించాలని, ఆరార్కే గారు ఎప్పుడూ అనేవారు. ఈ రోజుల్లో అంతగా ఈ సమస్యలేకపోయినా పాతకాలం రోజుల్లో ప్రభువునంగీకరించిన వారెదుర్కొనే సమస్యలు చాలా గడ్డుగా ఉండేవి.

ప్రభువుకోసం నమ్మకమైన సాక్షులుగా అనేకమంది సేవ చేస్తున్నారు. కొందరు సేవకులతో పాస్టర్ మణిబాబు గారు ఏర్పాటు చేసిన చిన్న సమావేశంలో నేను మాట్లాడాను. నేను ఆశీర్వదించబడడానికి దైవజనులను దేవుడువాడుకున్న విధానం వారు నా యెడల చూపిన ప్రేమను, మాకుగల ఆత్మీయ బంధాన్ని జ్ఞాపకం చేసుకుని ప్రభువును స్తుతించాము. ఈ సేవకులందరితో ప్రేమవిందు సమయం, స్పందన పరిచర్యలోనుండి అందరికీ కానుకలు, నూతన వస్త్రాలు అందించటానికి ప్రభువు కృపచూపారు.

ఈ సేవకుల అద్భుత సాక్ష్యాలు స్పందన టివి కార్యక్రమాల్లో మీరు వీక్షించవచ్చు, స్పందన పత్రికలో కూడా ప్రచురించనున్నాము. పాస్టర్ మణిబాబు గారి కోసం, వీరి మధ్య జరిగే సేవకోసం ప్రార్థించండి. మీ సంఘాల్లో గాని, మీరు నిర్వహించే సభల్లోగాని ఈ దైవసేవకుల ద్వారా సాక్ష్యాలు చెప్పించాలని ఆశిస్తే పాస్టర్ మణిబాబు గారిని (సెల్:


"ఆత్మావేశంతో డా॥ దేవ సందేశం"


ప్రార్థనలో దేవుని సేవకులు


డా॥ దేవ, పాస్టర్ మణిబాబు


హాజరయిన సేవకులు

RNI No: 32106/76 Regd No. VJ/057/2009-11
Licenced to post without pre-payment No. PMG/VJ/PWPP/21/2009-11





# స్పందన టి.వి.కార్యక్రమాలు

- వీనుల విందైన సంగీతం
- ఆశీర్వాదం కలిగించే ఆత్మపూర్ణ సందేశాలు
- మీ కోసం ప్రత్యేక ప్రార్థనలు
- 'అడిగారు కాబట్టి' మీ ప్రశ్నలకు జవాబులు
- వార్తలు-వాఖ్యలు 'మారిన జీవితాలు' సజీవ సాక్ష్యాలు




ప్రార్థించండి! సహకరించండి!!

దైవజనులు ప్రసంగించి మీ కోసం ప్రార్థిస్తారు.

స్పందన, పోస్ట్ బాక్స్ 815, గుణదల, విజయవాడ - 520 004




## విజయవాడ, గుణదలలో శాంతి, సువార్త ప్రార్థన మందిరం,

# అనాథ, పేదపిల్లల ఆశ్రమము

స్పందన - సేవియర్స్ హార్ట్‌బీట్ పరిచర్యల్లో మా ప్రియ పాఠకులు ఇంతదనుకా ఎన్నో విషయాల్లో సహకరించారు. దేవుని మహిమ కోసం మీకు తెలియజేసేదేమంటే - పత్రిక ప్రచురణ కాని, స్పందన పరిచర్యల ద్వారా మేము చేసే సేవాకార్యక్రమాలు కాని, కేవలం ప్రభువు మీద ఆధారపడి విశ్వాసంతో కొనసాగించేవి. మీలాంటి అనేకమంది ప్రభువు బిడ్డలు ఈ సేవ కోసం ప్రార్థిస్తున్నారు, సహకరిస్తున్నారు. చాలా మంది సహకరిస్తామని 'విశ్వాసపు వాగ్దానాలు' కూడా చేస్తున్నారు, విశ్వాసపు వాగ్దానం అంటే ప్రతినెలా ఇంతకానుక పంపుతామని ముందుగానే వాగ్ధానం చేయటం. వారి విశ్వాసాన్ని ప్రభువు ఘనపరచి అనుకున్న దానికంటే ఎక్కువ చేయటానికి ప్రభువు కృపచూపుతున్నారని సాక్ష్యమిస్తున్నారు. దేవునికి స్తోత్రాలు. మాతో కలిసి మీరూ ప్రార్థించండి. కావలసిన ఆర్థిక సహకారం ఇవ్వగలవారిని ప్రభువు సిద్ధంచేసి ఉంచాడని విశ్వసిస్తున్నాము. ప్రభువును అడగండి, ప్రభువు మీతో మాట్లాడిన ప్రకారం ఈ నిర్మాణానికి సహకరించాలని కోరుతున్నాము.

స్పందన, ఇయస్ఐ హాస్పటల్ రోడ్, గుణదల, విజయవాడ-4.